



ఎస్పీ దంపతుల ఆయుధ పూజ

రాజమహేంద్రవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయ దశమి సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సాయుధ రిజర్వు పోలీసు జిల్లా ప్రధాన కార్యాలయంలో ఎస్పీ నరసింహ కిశోర్ దం పతులు ఆయుధ పూజ చేశారు. దుర్గామాత విగ్రహానికి, పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గాంధీజీ, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు.చిత్రపటాలకు ఎస్పీ దంపతులు పూలమాలలు వేశారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఏవీ సుబ్బరాజు,ఎల్.చెంచిరెడ్డి,ఎస్బీ డీఎస్పీ రామకృష్ణ పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు.. ఆనందం

- 35,538 మంది అర్హులు
- ఒక్కో డ్రైవర్‌కు రూ.15 వేలు
- నేడు ఖాతాల్లో రూ.53 కోట్లు

(రాజమహేంద్రవరం అర్బన్ - ఆంధ్రజ్యోతి)

సూపర్ సిక్స్ పథకాల అమలుతో సక్సెస్‌ఫుల్ పాలన దిశగా వెళుతున్న కూటమి సర్కారు ఈ సారి ఆటోకార్మికులకు అండగా నిలుస్తోంది.స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన ప్రభుత్వం.. తాజాగా 'ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన ఆటో డ్రైవర్లు, మాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థికసాయం అందజేయనుంది. శనివారం ఉమ్మడి జిల్లాలోని అర్హులైన డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో రూ.53 కోట్ల సొమ్ము వేయనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36,630 మంది డ్రైవర్లు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 14,722 మంది దరఖాస్తు చేసుకోగా 12966 మందిని అర్హులుగా ప్రభుత్వం నిర్ధారించారు. తూర్పుగోదావరి జిల్లాలో 13,147 మంది దరఖాస్తు చేసుకోగా 11,915 మంది అర్హులుగా తేలింది. 172 దరఖాస్తులు తిరస్కరించగా 81 దరఖాస్తులను హోల్డ్‌లో ఉంచింది. కోనసీమ జిల్లాలో స్వల్పంగా 8,491 దరఖాస్తులే దాఖలయ్యాయి.7709 దరఖాస్తులకు అధికారులు ఆమోదముద్ర వేశారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 35,538 మంది దరఖాస్తులకు ఆమోదం లభించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అర్హులైన ఆటోడ్రైవర్లకు రూ.11.56 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 11,915 మంది ఆటో డ్రైవర్లకు రూ.17.87 కోట్లు, కాకినాడ జిల్లాకు సంబంధించి రూ.19.45 కోట్లు ఆర్థిక సాయం అందించను న్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులందరికీ రూ.15 వేల చొప్పున రూ.53 కోట్ల నగదు శనివారం బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా అమరావతి నుంచి శనివారం కార్యక్రమం ప్రారంభిస్తారు. తూర్పుగోదావరి జిల్లా కార్యక్రమం రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో శనివారం ఉద యం 10 గంటలకు నిర్వహిస్తారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి నిమ్మల రామానాయుడు హాజరవుతారు. నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభిస్తారు. ఈ మేరకు ఎక్కడికక్కడ రవాణా అధికారులు ఏర్పాట్లు చేశారు.

దేశంలో మరోసారి స్వదేశీ ఉద్యమం : మాధవ్



రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్య మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖాదీ సంతను చివరి రోజైన శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు.

తల్లీ నిను దుంచి!



నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయం విజయదశమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక స్వర్ణాభరణాలు, పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. - నిడదవోలు

డిజిటల్ అరెస్ట్!

సెట్టు వేస్తారు.. సెట్ చేసి కొట్టేస్తారు!



మోసం ఇలా..

ఇతర రాష్ట్రాల నుంచి సైబర్ నేరగాళ్లు వివిధ ప్రాంతాల్లోని డాక్టర్లు, బడా వ్యాపారులు, విశ్రాంత ఉద్యోగుల వివరాలు తెలుసుకుంటారు. దీని కోసం స్థానికంగా ఉన్న యువకులకు ఉద్యోగాలిచ్చి ఆయా ప్రాంతాల్లోని ప్రముఖుల నెంబర్లు సేకరించి తతంగం ఆరంభిస్తారు. ఓ గదిలో పోలీస్ అధికారి గది మాదిరిగా సెట్టు వేస్తారు. స్కైప్, వాట్సాప్, టెలిగ్రాం ద్వారా కాల్ చేస్తారు. డీపీలు పోలీసుల డ్రెస్సుల్లో ఫొటోలే ఉంటాయి. ఎస్పీ, డీఐజీ, ఐజీ వంటి పెద్ద హోదాల పేర్లతో పరిచయం చేసుకుని ఐడీ కార్డు చూపిస్తారు. వివిధ కారణాలను చూపుతూ ఆయా వ్యక్తుల అనుపానువులకు అనుగుణంగా భయపెడతారు. ఎవరైనా కాస్త వాయిస్ పెంచి ప్రశ్నిస్తే నకిలీ అరెస్టు వారెంట్లు మెసెంజర్ ప్లాట్ ఫాంల ద్వారా పంపిస్తారు. ఎవరికైనా ఈ విషయం చెబితే ఇంటికి వచ్చి సంకెళ్లు వేసి తీసుకెళతామని బెదిరిస్తారు. కేసులో ఉన్న సొమ్మును డిపాజిట్ చేయాలని హుకుం జారీ చేస్తారు. ఒక వేళ నిర్దోషి అని తేలితే వెనక్కి ఇచ్చేస్తామంటారు. సైబర్ కేటుగాళ్లు తాము చెప్పిన చిన్న చిన్న బ్యాంకు ఖాతాలకు ఆర్టీజీ ఎస్ ద్వారా సొమ్ములు జమ చేసుకుంటారు. వాటిని వెంటనే డ్రా చేసేస్తారు. లేదా భారీ కొనుగోళ్లకు ఈ డబ్బులను చెల్లిస్తారు.

డిజిటల్ అరెస్ట్ లేనేలేదు..

సెట్టు వేసి డబ్బులు కొట్టేయడమే డిజిటల్ అరెస్టులో ముఖ్యాంశం. ఇటువైపు వ్యక్తి భయం పైనే పూర్తిగా ఆధారపడి మోసం చేస్తారు. అక్రమంగా సంపాదించిన వాళ్లు తమ లావాదేవీలు బయట పడతాయనే భయంతో కొందరు మోసపోతున్నారు. ఇందులో ఎక్కువగా డాక్టర్లు, ప్రభుత్వ అధికారులు ఉండడం గమనార్హం. డిజిటల్ అరెస్టు చట్టంలో ఎక్కడా లేదు. కేవలం ఊహ మాత్రమే.

రాజమహేంద్రవరంలో ఓ ప్రముఖ డాక్టర్‌కి స్కైప్ ద్వారా వీడియోకాల్ వచ్చింది. అవతల యూనిఫాంలో ఉన్న ఓ పోలీసు ఉన్నతాధికారి మాట్లాడుతున్నారు. ఆ అధికారి కూర్చున్న గదిలో జాతీయ పతాకం, బ్యానర్ వంటివన్నీ ఉన్నాయి.. మీరు విదేశాలకు హవాలా ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు పంపిస్తున్నట్టు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నాడు. అరెస్టు వారెంట్, ఏవేవో పోలీస్ ముద్రలతో ఉన్న పత్రాలను చూపించాడు. డిజిటల్ అరెస్టు చేస్తున్నామని చెప్పారు. ఎవరికైనా ఈ విషయం చెబితే ఇంటికొచ్చి అరెస్టు చేస్తామని భయపెట్టారు. ముందుగా మనీ లాండరింగ్‌లో తాము గుర్తించిన రూ.3.50 కోట్లు డిపాజిట్ చేయాలని..కేసులో మీ ప్రమేయమేమీ లేదని తేలితే ఆ డబ్బు తిరిగి ఇచ్చే స్తామని చెప్పాడు. ఆ డాక్టరు దఫదఫాలుగా నెల రోజుల్లో రూ. 3.50 కోట్లు డిపాజిట్ చేసేశాడు. ఆ తర్వాత విషయం తెలిసింది. ఆ డాక్టరు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్ర యించాడు. ఓ రూ.40 లక్షలు హోల్డు చేశారు. మిగతా సొమ్ము సైబర్ నేరగాళ్లు స్వాహా చేసేశారు..
- (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇది మరోచోట జరిగిన ఘటన.. డిజిటల్ అరెస్టు అంటూ ఓ 35ఏళ్ల లేడీ డాక్టర్‌ను భయపెట్టి వివస్త్రను చేశారు. ఫలానా చోట పుట్టుమచ్చలు ఉంటే మీరే నిందితులని, తమకు నిర్ధారణ చేయాలంటూ పోలీస్ దుస్తుల్లో ఉన్న కేటుగాళ్లు నమ్మించారు. స్క్రీన్ రికార్డింగ్ ద్వారా ఆ మహిళ వివస్త్రగా ఉన్న వీడియో తీశారు. అది చూపించి రూ.8 లక్షలు దోచేశారు.

ఇది రాజమహేంద్రవరంలోనే జరిగిన ఘటన.. సింగరేణి కాలరీస్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ తర్వాత ఇక్కడ స్థిరపడ్డారు. ఆయనకు స్కైప్ కాల్ వచ్చింది. హవాలాలో అతని అకౌంట్ ద్వారా విదేశాలకు డబ్బు వెళ్లిందని, కేసులు తేలే వరకూ డిజిటల్ అరెస్టులు చేస్తున్నామని చెప్పారు. రూ.60 లక్షలు దోచేశారు. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏడాదిలో 20 కేసులకుపైగా నమోదయ్యాయి. రాజమండ్రికి చెందిన ఎయిర్ పోర్ట్ విశ్రాంత ఉద్యోగిని కూడా వారం రోజులు డిజిటల్ అరెస్టు పేరుతో ఇంట్లో నిర్బంధించేశారు.

డిజిటల్ అనే పదాన్ని ఉపయోగించి ఏకంగా అరెస్టులు చేసేస్తున్నారు. బాగా చదు వుకున్నోళ్లు సులభంగా అరెస్టై, కాలు కదప డం లేదు. ఆర్థిక నేరాలకు సంబంధించి డిజిటల్ అరెస్టు ఓ పెద్ద సమస్యగా పరిణమించింది. కస్టమ్స్, ఆదాయపు పన్ను శాఖ, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీల అధికారులుగా వ్యవ హరిస్తూ పేరున్న వ్యక్తులు, ప్రముఖులు, ధనవంతులను మోసం చేసి డబ్బు కాజేస్తు న్నారు.ప్రధాని మోదీ సైతం 'మన్ కీబాత్' రేడియో ప్రసంగంలో డిజిటల్ అరెస్టుల బా రినపడొద్దని హెచ్చరించారంటే..ఊహాజనిత అరెస్టు సమాజంపై ఎంతటి ప్రభావం చూపిస్తోందో అర్థం చేసుకోవచ్చు.

- ఉమ్మడి జిల్లాలో 20కిపైగా కేసులు
- ప్రముఖులే టార్గెట్‌గా వ్యవహారం
- అక్రమ లావాదేవీలే పెట్టుబడి
- భయపెట్టి భారీగా లాగుడు
- మోసపోతున్న ఉన్నత చదువరులు
- రూ.3.50 కోట్లు ఇచ్చేసిన ఓ డాక్టర్
- వివస్త్రగా మారిన ఓ లేడీ డాక్టర్
- డిజిటల్ అరెస్టు.. చట్టంలో లేదు
- డబ్బు దోపిడీకి గురైతే వెనక్కి రాదు
- అప్రమత్తతే ఆయుధం

డౌట్ వస్తే.. డయల్ 112

కాల్ వస్తే వ్యక్తిగత, ఆర్థిక, బ్యాంకు తదితర సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదు.ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు చెప్పకూడదు. లింక్‌లను క్లిక్ చేయకూడదు. ఫోన్‌లో కాల్- బ్లాకింగ్ ఉపయోగించడం ద్వారా మోసపూరిత నెంబర్లు బ్లాక్ చేయవచ్చు. సైబర్ మోసగాళ్లని అనుమానం వచ్చిన వెంటనే 112కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఒకవేళ అప్పటికే మోసపోతే 1930కి ఫిర్యాదు చేయవచ్చు. నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ నేరాల్లో ఒకసారి డబ్బు నేరస్తుల చేతిలోకి వెళితే తిరిగి మళ్లీ మన చేతుల్లోకి రావడం దాదాపుగా అసాధ్యమని చెప్పవచ్చు. ఒకవేళ అప్పటికే మన అదృష్టం కొద్దీ బ్యాంకు ఖాతాలో మిగిలిన సొమ్మును పోలీసులు హోల్డు చేసినా.. కోర్టు, బ్యాంకుల నిబంధనలను దాటుకొని మన జేబులోకి వచ్చేసరికి కనీసం ఏడాది పడుతుంది.

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రకు 54 అవార్డులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమానికి సంబంధించి రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డుల పంట పండింది. మూడు రాష్ట్ర స్థాయి అవార్డులు, 51 జిల్లా స్థాయి అవార్డులు వచ్చినట్టు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ప్రకటించారు.ఈ నెల 6న జరిగే జిల్లాస్థాయి కార్యక్రమాల్లో అవార్డులు అందజేస్తారు. ప్రజా ప్రతినిధులు,అధికారులు, సిబ్బంది, ప్రజల కృషికి నిదర్శనమే అవార్డులని కలెక్టర్ తెలిపారు.జిల్లాకు వచ్చిన గుర్తింపులో భాగస్వాములైన ప్రతి వ్యక్తి,గ్రామం, పాఠ శాల,ఆసుపత్రి, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలకుఅభినందనలు తెలిపారు.

15 వరకూ స్కాలర్‌షిప్ దరఖాస్తులకు గడువు

రాజమహేంద్రవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) కు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో వాసుదేవరావు సూచించారు. ప్రభుత్వ పరీక్షల వెబ్‌సైటు www.bse.ap.gov.inలో దరఖాస్తు అందుబాటులో ఉందన్నారు. పరీక్ష ఫీజు ఈ నెల 16లోపు చెల్లించాలని, ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రశీదు డీఈవో కార్యాలయంలో ఈ నెల 18 వరకూ సమర్పించవచ్చని తెలిపారు.

జీఎస్టీపై అవగాహన

రాజమహేంద్రవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణలతో నూతనాధ్యాయం వైపు అడుగులు పడుతున్నాయని జిల్లా జీఎస్టీ (రాష్ట్ర) శాఖ జాయింట్ కమిషనర్ బి.సుధాకర్ తెలిపారు. స్థానిక ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయ న మాట్లాడారు.జీఎస్టీ రిటర్న్ ఫైలింగ్‌లో చేపట్టిన సంస్కరణలు,పారదర్శకతకు దోహదం చేస్తున్నాయని చెప్పారు. డిజిటల్ విధానంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని గుర్తు చేశారు. జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్ రూ పంలో వ్యాపార సౌలభ్యం, వినియో గదారుల రక్షణ, పారదర్శకత మరింత పెరుగుతుందన్నారు.కార్యక్రమంలో పలు వురు వ్యాపారులు,డీలర్లు పాల్గొన్నారు.



పుష్కరాలకు ప్రణాళికలు రూపొందించండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు -2027 పనులకు అంచనాలు రూపొందించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్,జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు.రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో శుక్రవారం అన్ని విభాగాల అధికారులతో సమీక్షించారు. తొలుత 21 రహదారుల విస్తరణకు సంబంధించి రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు.కోరుకొండ రోడ్డు, తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు, మోరంపూడి రోడ్డు జంక్షన్ నుంచి శ్యామల సెంటర్ వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టవలసిన ఆవశ్యకత ఉందన్నారు.పుష్కరాల క్రౌడ్ మేనేజ్‌మెంట్, ఘాట్ల అభివృద్ధి, ట్రాఫిక్ మళ్లింపు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేష న్‌పై చర్చించారు. కేవలం పుష్కరాల పేరుతో తాత్కాలిక ఏర్పాట్లు చేయకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని నిర్ణయించారు. దీర్ఘకాలిక విధానంలో రహదారుల విస్తరణ, మౌలిక వసతులు కల్పన, పర్యాటకంగా నగరాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్,డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, సిటీ ప్లానర్ కోటయ్య, రుడా సీపీ వో జీవీఎస్ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గోదాములపై దృష్టి పెట్టండి : జేసీ

కొవ్వూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బాణ సంచా తయారీ కేంద్రాలు, గోదాముల వద్ద పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని జేసీ వై.మేఘాస్వరూప్ అధికారులను ఆదేశించారు. కొవ్వూరు మండలం పంగిడిలో శుక్రవారం జేసీ, జీఎస్టీ నోడల్ అధికారి వై.మేఘాస్వరూప్ పర్యటించారు. ముందుగా జీఎస్టీ తగ్గింపుపై చేపట్టిన ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. బాణసంచా గోదాములను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బాణ సంచా తయారీ కేంద్రాలు, గోదాముల వద్ద ఫైర్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనికీలు చేసి భద్రతా ప్రమాణాలు పరిశీలించాలన్నారు.సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ద్వారా ప్రజలకు లభించే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్లు ఎం.దుర్గాప్రసాద్, ఎం.మెరికమ్మ,ఫైర్ అధికారి ఏవీఎస్ఎన్.వేణు ఉన్నారు.



దీపావళి బాణసంచా గోదాములు పరిశీలిస్తున్న జాయింటు కలెక్టర్ వై.మేఘాస్వరూప్

వేములూరు పంచాయతీలో విచారణ

కొవ్వూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వేములూరు పంచాయతీ నిధులు దుర్వినియోగంపై అధికారులు విచారణ చేపట్టారు. కొవ్వూరు మండలం వేములూరు పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని సెప్టెంబరు 16వ తేదీన సభ్యులు డీసెంటు ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు గ్రామ నాయకులు వినతిపత్రం అందజేయడంతో విచారణ చేపట్టాలని డీఎల్ పీవోను ఆదేశించారు.ఈవోపీఆర్ఆర్‌డీ బీహెచ్ఎస్.ప్రకాశరావు శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, నాయకుల సమక్షంలో విచారణ చేపట్టి ఫైల్స్‌ను సీజ్‌చేసి తీసుకెళ్లారు. రెండు,మూడు రోజుల్లో డీఎల్‌పీవోకు నివేదిక అందజేస్తానని ఈవోపీఆర్ఆర్‌డి ప్రకాశరావు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

అధికారులను ఆదేశించిన కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక వ్యవసాయ పద్ధతులు అనుసరించడం ద్వారా ప్రకృతి వ్యవసాయంలో కూడా అధిక దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖపై శుక్రవారం సాయంత్రం సమీక్షించారు. ఖరీఫ్ సీజన్ వరి పంటలో ఇప్పటి వరకు 99.24 శాతం ఈ పంట నమోదు జరగగా మొత్తం అన్ని పంటలూ కలిపి 71.54 శాతం నమోదైందన్నారు. అక్టోబరు 30 నాటికి 100శాతం ఈ పంట నమోదు పూర్తి చేయాలని సూచించారు. రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. రైతులు వరి పంటలో కృత్రిమ ఎరువులు తగ్గించి సహజ పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడి సాధ్యమవుతుందన్నారు. డ్వాక్రా మహిళలను గుర్తించి రాయితీపై వ్యవసాయ డ్రోన్లు అందించడం ద్వారా వారికి ఉపాధి కల్పించవచ్చని సూచించారు. కౌలు కార్డు కలిగిన ప్రతి కౌలు రైతుకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని.. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని గుర్తించి ఆ గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, డీపీఎం తాతారావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మేముసైతం!



గాంధీ జయంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం కోటిలింగాలఘాట్‌లో గురువారం తమ సిబ్బందితో సీఆర్పీఎఫ్ 42వ బెటాలియన్ కమాండెంట్ ధర్మ ప్రకాశ్ స్వచ్ఛతా అభియాన్ నిర్వహించారు. మెట్లు శుభ్రం చేశారు. - రాజమహేంద్రవరం

పన్ను..పోటులేదు..



జీఎస్టీపై ఊరూవాడా అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ కవలగొయ్యిలో శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ర్యాలీ చేశారు. ఆయనతో నాయకులు జతకలిశారు. - రాజమహేంద్రవరం రూరల్



బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.



సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.



రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు



నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, అనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన సయ్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభుత్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు



హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయుకుడు యనమల నాగార్జునయాదవ్



మహాశక్తి యాగం చివరి రోజు అమ్మవారికి హారతి ఇస్తున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి, లలితా సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ముగిసిన మహా క్రతువు

- కాకినాడ శ్రీపీఠంలో వైభవంగా మహాశక్తి యాగం పూర్ణాహుతి
- దిగ్విజయంగా శతకోటి లలితా సహస్రనామ కుంకుమార్చన



పూర్ణాహుతిలో ద్రవ్యాలు సమర్పిస్తున్న స్వామి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో పదకొండు రోజులు జరిగిన 3వ మహాశక్తి యాగం గురువారం ముగిసింది. వెయ్యి కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చన లక్ష్యంతో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు మహా క్రతువు నిర్వహించారు. మూడు పర్యాయాలుగా జరిగిన మహాశక్తి యాగంలో వేలాది మంది భక్తుల నడుమ ఇప్పటివరకు 300 కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చన పూర్తి చేసుకున్నట్టు పరిపూర్ణానంద తెలిపారు. ఈ మహా క్రతువులో భాగస్వాములైన మహిళామూర్తులంతా ధన్యులేనన్నారు. త్రికరణ శుద్ధి కలిగిన మనసుతో ఓ తపస్సులో భక్తులు పాల్గొని శతకోటి కుంకుమార్చనలో భాగస్వాములుగా నిలిచారని, వీరికి అమ్మ అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రపంచం గుర్తించేలా ప్రముఖ ఆధ్యాత్మిక శక్తికి కాకినాడ బిందువు కావాలనేదే తన ఆకాంక్ష అన్నారు. వెయ్యికోట్ల కుంకుమార్చనతో ఇక్కడో ఓ మహాశక్తిని చూస్తారన్నారు.

గత 25 సంవత్సరాలుగా శ్రీపీఠం ఆస్థాన విద్వాంసులుగా సంగీత సేవలందిస్తున్న వినుకోట వెంకటేశ్వరరావు బృందాన్ని ఘనంగా సత్కరించగా శ్రీపీఠం చైర్మన్ పిన్నమనేని సుదీర్‌రాజు సువర్ణ అంగుళీకాలను ప్రదానం చేశారు. చివరిరోజున ఐశ్వర్యాంబిక అమ్మవారికి రజత కవచంతో విశేష అలంకరణ చేశారు. వేద పండితులు, రుత్వికుల మంత్రోచ్చారణలతో పలు రకాల విశేష ద్రవ్యాలతో స్వామి పరిపూర్ణానంద చేతులమీదుగా మహా పూర్ణాహుతిని అత్యంత వైభవంగా జరిపారు.

వాడపల్లి వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలకు పందిరిరాట ముహూర్తం



దేవదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ఆలయంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు జరిపి పందిరి రాట ముహూర్తం చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఈవో, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను సచివాలయంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు మంత్రులు వాసంశెట్టి సుభాష్, నిమ్మల రామానాయుడు, సవిత, కొండపల్లి శ్రీనివాసరావుకు వాడపల్లి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు అందించారు. ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేసి శాలువాలతో సత్కరించారు.



పందిరిరాటకు పూజ చేస్తున్న అర్చకస్వాములు. చిత్రంలో ఈవో సూర్యచక్రధరరావు

దేశంలో మరోసారి స్వదేశీ ఉద్యమం

- మేకిన్ ఇండియాతో స్వయం సమృద్ధి
- ఖాదీ సంతలో స్టాళ్లు తిలకించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



ఖాదీ సంతలో వస్త్రాలను చూస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మహిళలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు మరోసారి స్వదేశీ ఉద్యమానికి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్య మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖాదీ సంతను చివరి రోజైన శుక్రవారం ఆయన సందర్శించారు. అక్కడ ఏర్పాటుచేసిన స్టాళ్లను తిలకించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ నడిపిన స్వదేశీ ఉద్యమాన్ని ప్రధాని స్ఫూర్తిగా తీసుకున్నారన్నారు. స్వదేశీ అంటే పాత చింతకాయ పచ్చడి కాదని, నిత్య నూతనమని వ్యాఖ్యానించారు. ఆత్మ నిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి నినాదాలతో ఆర్థిక స్వావలంబన కోసం అడుగులు వేస్తున్నామన్నారు. రక్షణ రంగం, విదేశాంగ విధానం, మన దేశ ఆర్థిక విధానం, విదేశీ పెట్టుబడులు తదితర అన్ని విషయాల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖాదీ ఉత్పత్తులను మరింత ప్రోత్సహించడానికి అవసరమైతే సినీ నటులను కూడా ప్రచారంలో ఉపయోగించుకునే ఆలోచన ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి, ఖాదీ సంత కన్వీనరు క్షత్రియ బాలసుబ్రహ్మణ్య సింగ్, నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, రొంగల గోపి, నర్సిపల్లి హారిక, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణారావు, కరుటూరి శ్రీనివాసరావు, వీరా వీరాంజనేయులు, కాలెపు సాయిరామ్, శెట్టిపల్లి శివనాగరాజు పాల్గొన్నారు. స్వదేశీ వస్తు వినియోగంపై మద్దిపాటి రజని ప్రతిజ్ఞ చేయించారు.

సామర్లకోట భీమేశ్వరాలయంలో కార్తీక మాస ఉత్సవాలకు శ్రీకారం

సామర్లకోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో కార్తీక మాస ఉత్సవాలకు అర్చకులు శుక్రవారం రాట ముహూర్తం చేశారు. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాదరావు, అలోక్‌చంద్ర జైన్, బాడితమాని లక్ష్మి, మండపల్లి భాను వెంకటపద్మ, తాతపూడి అరుణ్‌వంశీ, గొలితి సత్యనారాయణ పాల్గొన్నారు.



రాట ముహూర్తం చేస్తున్న ఈవో, పాలకమండలి సభ్యులు

ఉమ్మడి జిల్లా టెన్నిస్ ఎంపికలకు 70 మంది క్రీడాకారుల హాజరు



టెన్నిస్ పోటీలకు ఎంపిక నిర్వహిస్తున్న వ్యాయామోపాధ్యాయులు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అండర్-14, 17 స్కూల్ గేమ్స్ ఎంపికలు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి పర్యవేక్షణలో జరిగాయి. టెన్నిస్ ఎంపికలకు 70 మంది బాల, బాలికలు హాజరయ్యారు. వ్యాయామోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరిరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, సీనియర్ పీడీలు ఎల్.జార్జి, పట్టాభిరామం, టెన్నిస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రవిరాజు పాల్గొన్నారు.

అవార్డుల పంట...

స్వచ్ఛ పంచాయతీ రాష్ట్రస్థాయి అవార్డుకు 'లొల్ల' ఎంపిక


లొల్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆత్రేయపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్మూలనలో లొల్ల గ్రామం ఆదర్శనీయంగా నిలిచి రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డుకు ఎంపికైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల పంచాయతీ స్వచ్ఛ అవార్డుకు ఎంపిక కోసం ఈనెల 6న చంద్రబాబు చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ కాయల జగన్నాథం స్వచ్ఛ భారత్ అవార్డును అందుకోనున్నారు. లొల్ల పంచాయతీలో ముగ్గురు గ్రీన్ అంబాసిడర్లతో ఇంటింటికి వెళ్లి తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరించడంతో పాటు వర్మికం పోస్టు తయారు చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించి స్వచ్ఛ రహిత గ్రామంగా తీర్చిదిద్దడంలో సర్పంచ్ జగన్నాథం, కార్యదర్శి కృష్ణామాచార్యులు ఎంతగానో కృషిచేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా లొల్ల గ్రామంలో 90 శాతం అపారిశుధ్యం నిర్మూలించడంలో తీవ్ర కృషిచేశారు. ఈ నేపథ్యంలో లొల్ల పంచాయతీ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది.

అందరి సహకారంతోనే సాధ్యం...



ప్రజలందరి సహకారంతోనే తమ గ్రామం రాష్ట్ర స్థాయిలోనే ఆదర్శనీయంగా నిలవడం హర్షనీయం. గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి తడిచెత్త, పొడి చెత్తను సేకరించడంలో ప్రజలు ఎంతగానో సహకరిచడం ద్వారానే ఇది సాధ్యమైంది. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల సమష్టి కృషితో తమ గ్రామం ఈ అవార్డుకు ఎంపిక కావడం ఆనందదాయకం.

సర్పంచ్, కాయల జగన్నాథం

'తూర్పు'కు మూడు రాష్ట్ర స్థాయి అవార్డులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమానికి సంబంధించి తూర్పుగోదావరి జిల్లాకు జిల్లాకు మూడు రాష్ట్రస్థాయి అవార్డులు, 51 జిల్లా స్థాయి అవార్డులు వచ్చినట్టు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం ప్రకటించారు. ఈనెల 6న అవార్డులు అందుకోనున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల కేటగిరీలో 2 విభాగాల్లోనూ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొ రేషన్‌కు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ఇన్‌చార్జి కమిషనర్‌గా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఉన్నారు. స్వచ్ఛ బస్టేషన్ కేటగిరీలో కొవ్వూరు బస్టాండ్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. ఆర్టీసీకి చెందిన వై.కుమార్ అందుకోనున్నారు.

స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్ విభాగంలో పి.వెంకటాపురం ఆశ్రమ స్కూల్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంపై ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిన కాకినాడ రూరల్ పి.వెంకటాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ ఆశ్రమ స్కూల్ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్) ప్రతిష్టాత్మక స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది. బాలికల గురుకుల ఆశ్రమంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు నెలలో ప్రతీ మూడో శనివారం విద్యార్థులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం కోసం మొక్కల పెంపకం, సంరక్షణ, ఆరోగ్య సంరక్షణపై స్కూల్ ప్రిన్సిపాల్ పరిమళ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మెరుగైన పనితీరు కనబరుస్తున్న పాఠశాలలను ఇటీవల ప్రభుత్వం నియమించిన కమిటీ సందర్శించి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బాలిక గురుకుల పాఠశాల్లో మూడో శనివారంతోపాటు సెలవు రోజుల్లో పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంతో పచ్చదనం వెల్లివిరిసేలా విద్యార్థులు, అధ్యాపకులు సమష్టిగా కృషి చేయడంతో ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపిక చేసినట్టు శుక్రవారం ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రస్థాయిలో తమ స్కూల్‌కి రావడం పట్ల ప్రిన్సిపాల్ పరిమళ ఆనందం వ్యక్తం చేశారు.

'ఎలైట్'కు స్వచ్ఛ పరిశ్రమ అవార్డు

పెద్దాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన అవార్డుల్లో స్వచ్ఛ పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) అవార్డును ఎలైట్ ఇనుస్ట్రుమెంట్స్ పరిశ్రమ దక్కించుకుంది. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో ఈ అవార్డు దక్కించుకున్నట్టు ఎలైట్ ఇనుస్ట్రుమెంట్ కమర్షియల్ మేనేజర్ కృష్ణ తెలిపారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ క్లీన్ ఇండస్ట్రీ పాలసీని అనుసరిస్తున్నందుకు స్వచ్ఛ పరిశ్రమ అవార్డును పొందింది.

తునిలో మృతదేహం కలకలం

ముఖంపై దారుణ గాయాలు

కొట్టి చంపారనే అనుమానాలు


ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

తుని రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణంలో వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. తుని రైల్వే ఫ్లైఓవర్ నర్సీపట్నం బస్టాండ్ సమీపంలో ముఖంపై దారుణమైన గాయాలతో గుర్తు పట్టలేనంతగా ఉన్న యువకుడి మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను రప్పించి ఆధారాలు సేకరించారు. ఎవరైనా కొట్టి చంపి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖంపై తప్ప ఎక్కడా ఎటువంటి గాయాలు కనిపించడం లేదు. సమీపంలో ఉన్న ఒక మద్యం బాటిల్‌ను స్వాధీనం చేసుకుని అది ఎక్కడ కొనుగోలు చేశారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పరిశీలించారు. వివిధ కోణాల్లో దర్యాప్తుకు సంబంధించి స్థానిక పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైలు నుంచి జారి పడి వృద్ధుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న తుని రైల్వే పోలీసులు

తుని రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సుమారు 78 ఏళ్ల వృద్ధుడు కుటుంబసభ్యులతో ప్రయాణం చేస్తూ మార్గమధ్యలో హంసవరం రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తూ జారి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. బంధువులు టోల్‌ఫ్రీకి ఫోన్ చేయగా జీఆర్పీ పోలీసులు వివరాలు తెలియపరిచారు. దీంతో బంధువులు తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని నిర్ధారించడంతో పంచనామాల అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించినట్టు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి...

రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో అన్నవరం రైల్వేస్టేషన్‌లో జరిగింది. గురువారం జరిగిన ఈ ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు వెల్లడించారు. 35 ఏళ్ల వ్యక్తి మరణించాడని, మృతికి గల కారణాలు తెలియరాలేదన్నారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లేవని తుని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ మోహన్‌రావు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో కానీ 94906 19020 నెంబర్‌ను కానీ సంప్రదించాలని ఆయన కోరారు.

సామర్లకోటలో...

సామర్లకోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో మొదటి ప్లాట్‌ఫాం పట్టాలు దాటుతున్న వ్యక్తిని గుంటూరు నుంచి విశాఖ వైపు వెళ్తున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొన్న సంఘటనలో అక్కడికక్కడే మృతిచెందాడు. సింహాద్రి ఎక్స్‌ప్రెస్ లోకోపైలట్, ట్రైన్‌మేనేజరులు స్టేషన్ సూపరింటెండెంట్‌కు అందించిన సమాచారంతో రైల్వే ఎస్ఐ, ఆర్పీఎఫ్ ఎస్ఐలు సంఘటనా స్థలికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. రైలు ఢీకొనడంతో మృతదేహం 2ముక్కలుగా విడిపోయినట్టు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని గుర్తించేందుకు పోలీసులకు ఏ వివరాలు లభ్యం కాకాపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దసరా.. సరదా!

- అంబరాన్నంటిన అమలాపురం దసరా ఉత్సవాలు
- ఉభయ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలు
- డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మీనా ఆధ్వర్యంలో బందోబస్తు
- ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు


అమలాపురంలోని ఓ వీధిలో విన్యాసాల దృశ్యం


పట్టణంలో ఊరేగిన ఓ వాహనం


ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన


అగ్నితో అబ్బురపరుస్తూ...

అమలాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సంబరం అంబరాన్నంటింది.. ఆనందం ఉరకలేసింది.. వీధులన్నీ ఒక్కటయ్యాయి.. దసరా శోభను సంతరించుకున్నాయి.. పోటాపోటీగా ఉత్సవాలను నిర్వహించారు. అమలాపురం అంతా ఆనందంతో నిండిపోయింది. విజయదశమి పర్వదినం సందర్భంగా గురువారం అమలాపురం లో జరిగిన చెడీ తాలింఖానా ఉత్సవ ఊరేగింపులు కనుల పండువగా జరిగాయి. వేలాది మంది ప్రజలు ఉత్సవాలను తిలకించారు. భారీ బందోబస్తు నడుమ అమలాపురంలోని వివిధ ప్రాంతాల్లోని ఏడు వీధులకు చెందిన ఉత్సవ ఊరేగింపుల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు చెడి తాలింఖానా ప్రదర్శనలు చూపరులను కనువిందు చేశాయి. ఒక్కో వీధికి ఒక్కో వాహనాన్ని ఊరేగింపుగా పురవీధుల గుండా తీసుకువచ్చారు. అమలాపురం పట్టణం చెడీతాలింఖానా జాతరతో గురువారం రాత్రి కిక్కిరిపోయింది. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి స్వయంగా వారే దగ్గరుండి పర్యవేక్షించారు. ఏటా మాదిరిగానే ఉభయ రాష్ట్రాల నుంచి వేలాదిగా ప్రజలు అమలాపురంలో చెడీ తాలింఖానా ఉత్సవాలను చూసేందుకు తరలివచ్చారు. ముఖ్యంగా పట్టణంలోని గండువీధి, రవణంవీధి, రవణం మల్లయ్యవీధి, నల్లా వీధి, మహిపాలవీధి, కొంకాపల్లి, శ్రీరామపురంలకు చెందిన ఊరేగింపుల్లోని కొన్నిటిలో చెడీ తాలింఖానా విన్యాసాలు అలరించాయి. కళ్లకు గంతలు కట్టుకుని పొట్టపై కొబ్బరికాయలు, కూరగాయలు ఉంచి కత్తితో నరికేందుకు చేసే అద్భుత విన్యాసం చెడీ తాలింఖానాల్లో ప్రత్యేక సంతరించుకుంది. కర్రసాములు, కత్తిసాము, అగ్గి బరాటా విన్యాసాలతో ఉత్సవాలను రక్తికట్టించారు.

సందడి చేసిన ప్రజాప్రతినిధులు


కత్తులతో ప్రదర్శన చేస్తున్న ప్రజాప్రతినిధులు

అమలాపురంలో జరిగిన చెడీ తాలింఖానా ఉత్సవాలను వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సందర్శించారు. ఆయా ఉత్సవ కమిటీల ఆహ్వానం మేరకు ఆయా వీధుల్లో తిరిగి పటాకత్తులు చేతబట్టి విన్యాసాలు చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడుతో పాటు బీజేపీ నాయకుడు నల్లా పవన్‌కుమార్, అడబాల సత్యనారాయణ, యాళ్ల దొరబాబు, జనసేనకు చెందిన అనేక మంది నాయకులు ఆయా పురవీధుల్లో తిరుగుతూ ఊర్రూతలూగించారు.

డీఐజీ పర్యవేక్షణ..


పర్యవేక్షిస్తున్న డీఐజీ, ఎస్పీ

అమలాపురంలో జరిగిన చెడీ తాలింఖానా ఉత్సవాల్లో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. డ్రోన్లు, బాడీ టచ్ కెమెరాలు, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేశారు. ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు రాత్రి ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో పర్యటించి బందోబస్తును పర్యవేక్షించారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. అవాంచనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత పరిస్థితుల నడుమ దసరా ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో అటు పోలీసు యంత్రాంగం, ఇటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

సరదగా బయలుదేరి అంతలోనే కన్నుమూసి..

బైక్‌ను ఢీకొన్న కారు

అక్కడికక్కడే ఇద్దరు మృతి

ఒకరికి తీవ్రగాయాలు


ప్రమాదానికి కారణమైన కారు


మృతి చెందిన ఓ వ్యక్తి

పెరవలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం నల్లాకుల వారిపాలెం జాతీయ రహదారి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఖండవల్లికి చెందిన కంతేటి పోసియ్య (20), బొంతు వెంకటేశ్వరరావు (34), ఇంజేటి ఇస్సాకు (49) వ్యవసాయ కూలీలు. గురువారం రాత్రి సరదగా తణుకు పయనమయ్యారు. ఖండవల్లి నుంచి తణుకు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా అదే సమయంలో రావులపాలెం నుంచి తణుకు వెళ్తున్న ఇన్నోవా కారు వేగంగా వచ్చి వీరిని ఢీకొంది. దీంతో పోసియ్య, ఇస్సాకు అక్కడికక్కడే మృతిచెందారు. వెంకటేశ్వరరావు తీవ్ర గాయపడగా తణుకు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

కొబ్బరి చెట్టును ఢీకొన్న ఆటో

వ్యక్తి మృతి

రాయవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని బుట్టాయపేట రహదారిలో ఆటో కొబ్బరి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. రాయవరం ఎస్ఐ. డి. సురేష్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంటూరు గ్రామానికి చెందిన దుగ్గిరాల రాంబాబు(57) విజయదశమిని పురస్కరించుకుని చెల్లూరు శివారు బుటాయిపేటలో బంధువుల ఇంటి వద్ద భవానీ మాలధారులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వెళ్లాడు. అక్కడ నుంచి ఆటోలో తిరిగి వస్తున్న సమయంలో గురువారం సాయంత్రం బుట్టాయి పేట రహదారి చెంతనే ఉన్న కొబ్బరి చెట్టును ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో రాంబాబుకు గాయాలయ్యాయి. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాంబాబుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఆటో ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆధునికీకరణకు రూ.3 వేల కోట్ల కేటాయింపు అడిగా : మంత్రి నిమ్మల


రాజోలులో శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే దేవ

మలికిపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలో పేరుకుపోయిన పనులను పూర్తి చేయడానికి రూ.2వేల నుంచి రూ.3వేల కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లానని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో శంకరగుప్తం డ్రైయిన్ పరీవాహక ప్రాంతంలో చనిపోయిన కొబ్బరి చెట్లను గురువారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాల విధ్వంసంతో కాల్వలు, డ్రెయిన్లు పాడైపోయాయని, ముందు చూపుతో వ్యవహరించకపోతే కాటన్ దొరకు ముందు ఈ ప్రాంత పరిస్థితులు ఎలా ఉండేవో అదే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారన్నారు. 1990లో ముఖ్యమంత్రి చెన్నారెడ్డి ఉండగా కాల్వలు, డ్రెయిన్లు ఆధునికీకరించారని, మళ్లీ లేదన్నారు. 34 నియోజకవర్గాల పరిధిలో ఈ పనులు చేపట్టడానికి సర్వే చేయడం కోసం అధికారులు రూ.15 కోట్లు అంచనా వేశారని, ఆ ప్రాజెక్టు రిపోర్టు తయారుచేయడానికి రూ.15 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. ఆధునికీకరణతోనే 34 నియోజకవర్గాల పరిధిలోని కాల్వలు, డ్రెయిన్లు ప్రక్షాళన జరుగుతుందన్నారు. కేశనపల్లి పంటకాల్వ పనులపై కూడా దృష్టి పెడతానన్నారు. గతంలో సస్యశ్యామలంగా ఉండే గోదావరి జిల్లాల కంటే మెట్ట ప్రాంతాల్లో రైతుల పరిస్థితి నేడు చాలా బాగుందన్నారు. ఆధునికీకరణ జరిగితే రైతులు పరిస్థితి మెరుగవుతుందని ఆయన చెప్పారు.

రాతి కట్టుబడికి మంత్రి నిమ్మల శంకుస్థాపన

రాజోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాజోలులో వశిష్ట గోదావరి నది ఏటిగట్టును పటిష్టం చేసేందుకు ఒక కిలోమీటరున్నర వరకు రూ.25.10 కోట్లతో రాతి కట్టుబడికి మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాజోలు ఏటిగట్టు రక్షణ గోడకు శంకుస్థాపన చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఇటుక తీసి ఇటుక పెట్టిన పాపాన పోలేదని, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు చేపట్టారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ అహర్నిశలు పనిచేస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క నీటి ప్రాజెక్టును పట్టించుకోలేదని విమర్శించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చొరవతో మరిన్ని అభివృద్ధి పనులు నియోజకవర్గంలో చేపడతానని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చిట్టచివరి ప్రాంతం రాజోలు నియోజకవర్గమని, వశిష్ఠ గోదావరి ఇక్కడ బంగాళాఖాతంలో కలుస్తుందని తెలిపారు. వరదల సమయంలో అనేక ఇబ్బందులు ఇక్కడి ప్రజలు పడుతున్నారని, ఒకటిన్నర కిలోమీటరు రాతి కట్టుబడి గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. రాజోలులో రూ.7 కోట్లతో ఏటిగట్టును ఎత్తుచేసే ప్రతిపాదన కూడా మంత్రి నిమ్మల అంగీకారం తెలపడం పట్ల ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అమలాపురం ఆర్డీవో కె.మాధవి, అడ్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, సీఈ కె.శేషుబాబు, ఎస్ఈ కె.గోపీనాథ్, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, ఎంపీపీ కడలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, గుబ్బల ఫణికుమార్, బందెల పద్మ, మంగెన భూదేవి, మోకా పార్వతి పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



ప్రదర్శనలో దుస్తులను తిలిస్తున్న పీడీజే సునీత, బహుతులు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ అడుగుజాడల్లో మనం నడవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. గురువారం గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారంలో సూపరింటెండెంట్ రాహుల్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సునీత హాజరయ్యారు. గాంధీ ఆదర్శాలు, భావాలను ఖైదీలకు వివరించారు. ఖైదీల సాధికారత కోసం ఉపాధి కల్పనా కోర్సులు, విద్య, ఆరోగ్య సేవలు, న్యాయ విజ్ఞానం, న్యాయ సహాయం, హక్కులు తెలియజేయడంలో జైలు అధికారులు మరింత మెరుగైన చొరవ చూపాలని సూచించారు. మహిళా ప్రత్యేక కారాగారంలో సూపరింటెండెంట్ వసంత కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలకు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ ఇంచార్జి కార్యదర్శి బి.పద్మ ముఖ్య అతిథిగా హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు కారాగారాల్లో ఖైదీలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. గాంధీ జయంతి సందర్భంగా వివిధ పోటీల్లోని విజేతలకు పీడీజే సునీత, డీఎల్ఎస్ఏ ఇంచార్జి కార్యదర్శి పద్మ బహుమతులను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి 7న ఫ్యాప్టో పోరుబాట

ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ సాయిశ్రీనివాస్



అమలాపురంలో ఫ్యాప్టో పోరుబాట ప్లకార్డులతో నిరసనలో రాష్ట్ర చైర్మన్ సాయిశ్రీనివాస్

అమలాపురం టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల విడుదలపై ఏ చర్యలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 7న విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో పోరుబాట నిరసన కార్యక్రమం చేపట్టినట్టు రాష్ట్ర చైర్మన్ లంకపల్లి సాయిశ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ఫ్యాప్టో నాయకత్వం పిలుపు మేరకు చేపట్టిన మహాధర్నాలో భాగంగా సన్నాహక సమావేశం ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎంటీవీఎఎస్ సుబ్బారావు అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎస్టీయూ విద్యా భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగాహాజరైన ఫ్యాప్టో చైర్మన్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్నా విద్యా పరమైన, ఆర్థిక పరమైన సమస్యలకు పరిష్కారం చూపలేదన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. మధ్యంతర భృతి ప్రకటించకపోగా కనీసం డీఏ బకాయిలు కూడా విడుదల చేయలేదని విమర్శించారు. ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి దొరబాబు, సంఘ సభ్యులు మోకా ప్రకాష్, రాయుడు ఉదయభాస్కర్, నాగిరెడ్డి శివప్రసాద్, పెంకే వెంకటేశ్వరరావు, సరిదే సత్యపల్లంరాజు, షబ్బీర్ హుస్సేన్, గుత్తాల వెంకటేశ్వరరావు, బొంతు వీవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. పోరుబాటను విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు.

స్ఫూర్తి ప్రదాత 'ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్'



సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి

తణుకు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో కర్మాగారాన్ని స్థాపించి అనేకమందికి ఉపాధి కల్పించిన డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. తణుకు ఆంధ్రా షుగర్స్ కాలనీలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం యువత సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ, వారసత్వ విద్యలను, కళలను పెంచుకోవాలని సూచించారు. యోగా, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలన్నారు. కుటుంబ విలువల తగ్గిపోతున్న తరుణంలో సంస్థ ఉద్యోగులు అంతా ఒక కుటుంబంలా వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రా షుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య మాట్లాడుతూ షుగర్స్ 500 టన్నుల సామర్థ్యంతో ప్రారంభమై పదివేల టన్నుల సామర్థ్యం వరకు పురోగమించిందన్నారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రవచన రత్నాకర ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ ప్రసంగించారు. సంస్థ ఉద్యోగులు విశ్వనాథకుమార్, సాంబశివరావు, శ్రీనివాసు పాల్గొన్నారు.

వ్యక్తి ఛాతి నుంచి బుల్లెట్ తొలగింపు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి ఛాతిలోకి చొచ్చుకుపోయిన బుల్లెట్‌ను కాకినాడ జీజీహెచ్ సర్జరీ వైద్యులు తొలగించి పునర్జన్మను ప్రసాదించి విజయవంతమయ్యారు. వివరాలిలా ఉన్నాయి. ఏఎస్ఆర్ జిల్లా గంగవరం మండలం చిన్నగార్లపాడుకు చెందిన 31 ఏళ్ల వ్యక్తి గత నెల 25న కోతులను బెదిరించే క్రమంలో నాటు తుపాకీని పేల్చగా ప్రమాదవశాత్తు తుపాకీలోని బుల్లెట్ అతడి ఎడమ ఛాతిలో నుంచి ఊపిరితిత్తులోనికి చొచ్చుకుపోయింది. స్థానికులు సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం బాధితుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నందున మెరుగైన చికిత్స కోసం హుటాహుటిన కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అదేరోజు రాత్రి ప్రాణాపాయంలో ఉన్న బాధితుడికి సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ నరేష్, డాక్టర్ కిరణ్, డాక్టర్ రవి కిరణ్ బృందం శస్త్ర చికిత్స నిర్వహించి చాకచక్యంగా బుల్లెట్‌ను తొలగించారు. బాధితుడు ప్రాణాపాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. వైద్య బృందాన్ని ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి అభినందించారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

రాష్ట్ర పోటీలకు ఐదుగురు విద్యార్థినుల ఎంపిక



బిక్కవోలు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పందలపా ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. బాల్‌బ్యాడ్మింటన్‌కు పైన గీతరమ్యశ్రీ, హ్యాండ్‌బాల్‌కు రాయి రూప, గొలుగూరి శ్రావ్యరెడ్డి, కోకోకు వైరాల సుస్మిత, గొల్లవిల్లి క్రాంతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, వారిని తీర్చిదిద్దిన పీడీ యువరాజారెడ్డిని పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయ ప్రతినిధి కర్రి వీరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

గద్దెలో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

గోకవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని వీరభద్రుని గద్దెలో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసాయి. ఆఖరు రోజైన గురువారం అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్, కోరుకొండ సీఐ సత్యకిషోర్,స్థానిక ఎస్ఐ పవన్ కుమార్ దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి సమర్పించిన 14 కిలోల లడ్డూను వేలంలో బత్తుల టింకు అనే భక్తుడు దక్కించుకున్నాడు. అలాగే గోకవరానికి చెందిన సిద్ధా పవన్‌కుమార్ సొంత ఖర్చులతో సుమారు 30మంది భవాని మాలధారులను విజయవాడ అమ్మవారి దర్శనానికి తీసుకెళ్లారు.

గాడాల ఘటనలో నలుగురి అరెస్టు: డీఎస్పీ

కోరుకొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నార్త్‌జోన్ పరిధిలో రౌడీయిజం చేసినా, దళితులు, మహిళలు, చిన్న పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా సహించబోమని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ పేర్కొన్నారు. కోరుకొండ పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కోరుకొండ మండలం గాడాల వద్ద మధురపూడికి చెందిన రాముల శ్రీనుపై దాడికి పాల్పడిన ఘటనలో గాడాలకు చెందిన నలుగురు యువకులను అరెస్ట్ చేశామన్నారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేశామన్నారు. అలాగే ఈ ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేసినా వర్గ వైషమ్యాలు చెలరేగే విధంగా పోస్టులు పెట్టిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐ సత్యకిషోర్, ఎస్ఐ నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్.. అనపర్తి ఏరియా ఆసుపత్రి తనిఖీ



ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మ

అనపర్తి అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఏరియా ఆసుపత్రిని శుక్రవారం జిల్లా ఆసుపత్రి వైద్య సేవల సమన్వయాధికారిణి డాక్టర్ పద్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రి వైద్యుల హాజరు పరిశీలించారు. అనంతరం వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే రూ.13 కోట్లతో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగుర్రెడ్డి, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ పద్మశ్రీ, తదితరులున్నారు.

7న విజయవాడలో ఫ్యాప్టో పోరుబాట

దివాన్‌చెరువు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఈ నెల 7న విజయవాడలో పోరుబాట నిర్వహిస్తున్నామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ తెలిపారు. విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడలోని ధర్నా చౌక్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో పోరుబాట నిర్వహిస్తున్నామని శుక్రవారం తెలిపారు. సీపీఎస్ అమలుపై ఎన్నికల హామీ అమలుకు నోచుకోలేదని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ దయానిధి అన్నారు. సుమారు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిలు చెల్లింపునపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని, ప్లస్ టూ ఉపాధ్యాయుల కొరతను తీర్చాలన్నారు. 1998, 2008 ఎంటీఎస్, గురుకులాలు, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని తదితర సమస్యల సాధన కోసం ఈ కార్యక్రమం చేపడుతున్నామని వారు పేర్కొన్నారు.

తగ్గిన మందుల ధరలపై అవగాహన కలిగించాలి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 ద్వారా తగ్గిన మందుల ధరలపై వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కలిగించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తరచుగా ఉపయోగించే మందులు, అత్యవసర ఔషధాలు, వైద్య పరికరాలు వంటి వాటిపై పన్ను భారం తగ్గిందని, వైద్యఖర్చులు గణనీయంగా తగ్గుతాయని వివరించాలన్నారు. ధరల తగ్గుదలకు సంబంధించి జిల్లా వైద్యాధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రతి గ్రామంలో పర్యటించి అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు.

వివేక పథం-2026 ఫోల్డర్ ఆవిష్కరణ

అనపర్తి అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో రూపొందించిన వివేక పథం-2026 ఫోల్డర్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆవిష్కరించారు. సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సభ్యుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఏటా అనపర్తి ప్రాంతంలోని విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్రపై ప్రతిభా పోటీలు నిర్వహించి విజేతలకు పురస్కారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు సత్తి వెంకటరెడ్డి, తేతలి సుందరరామారెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, తాడి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

రాజానగరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఇండక్షన్ శిక్షణా తరగతులు రాజానగరం మండలంలో ఆరు కేంద్రాల్లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. 1328 మందికి పది రోజులు పాటు ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. మండలంలోని జీఎస్ఎల్ డెంటల్ కళాశాలలో రెండు కేంద్రాల్లోనూ, తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, భూపాలపట్నంలోని రైట్ ఇంజనీరింగ్ కళాశాల, కొండగుంటూరులోని సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాల, మల్లంపూడిలోని శ్రీసాయి మాధవి ఇంజనీరింగ్ కళాశాలలోనూ ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీ రీసోర్స్‌పర్సన్ శిక్షణ ఇస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారులు రామన్నదొర, జ్యోతి ప్రసాద్ తెలిపారు.

అనపర్తిలో రక్తదాన శిబిరం

అనపర్తి అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అనపర్తిలో రాంబాబు యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించి రక్త దాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఇప్పటి వరకూ 3000 యూనిట్ల రక్తాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 62 మంది రక్త దానం చేశారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు సత్తి రామకృష్ణారెడ్డి, ఎన్ఎంఎం బాలకృష్ణారెడ్డి, పడాల కళ్యాణరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఆరాధన

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆరాధనకు అసలైన అర్థాన్ని చెప్పే కార్యక్రమమే స్వచ్ఛమైన ఆరాధన అని యెహోవా సాక్షుల ప్రతినిధులు వివరించారు. రాజమహేంద్రవరం హోటల్ మంజీరాలో యెహోవా సాక్షులు ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగే స్వచ్ఛమైన ఆరాధన ఉచిత కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆరాధన, నేటి సవాళ్లు, వెతుకున్నది దేనికోసం, సత్యం తెలుసుకోవడం ఎంత అవసరమో అనే అంశాలు ఉంటాయని రీజనల్ స్పోక్స్‌మెన్ జి.సంజయ్ తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవం ప్రాంతాలకు చెందిన విశ్వాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆదివారం వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

జాంపేట బ్యాంకులో సెంటినరీ డిపాజిట్ పథకం

రాజమహేంద్రవరం కల్చరల్ అక్టోబర్3(ఆంధ్రజ్యోతి): స్థానిక జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో గురువారం శ్రీ శీలా వీరభద్రుడు సెంటినరీ డిపాజిట్ పథకాన్ని బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్ ప్రారంభించారు. జాంపేట బ్యాంకు వచ్చే ఏడాదికి శత వసంతాలు పూర్తికానుండడంతో శతాబ్ది వేడుకలు చేయాలని కమిటీ నిర్ణయించిన నేపథ్యంలో ఈ డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారు. పదేళ్ల ఈ పథకంలో 12.8శాతం వార్షిక దిగుబడి రేటు లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్లు ప్రసాదుల హరినాథ్, ద్వారా పార్వతీ సుందరి, జామిశెట్టి గాంధీ, మహంతి లక్ష్మణరావు, గుంటముక్కల సత్యనారాయణ ప్రసాదరావు, యాంద్రపు రామకృష్ణ, కనకం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధురాలిని కాపాడిన 108 సిబ్బంది

సీతానగరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రాణం కాపాడాలన్న లక్ష్యంతో 108 సిబ్బంది ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిని లెక్కచేయకుండా గ్రామానికి చేరుకుని వృద్ధురాలిని రక్షించారు. గోదావరి మధ్యలో ఉన్న లంకగ్రామమైన ములకల్లంకకు చెందిన 85 ఏళ్ల ఎం.అనసూయకు తీవ్ర అస్వస్థతగా ఉందని ఉదయం 6గం.లకు 108కు ఫోన్ రావడంతో పైలట్ బూసి లక్ష్మణరావు, ఈఎంటీ సీహెచ్ నాగలక్ష్మి హుటాహుటిన బయలుదేరి బొబ్బిలంక చేరుకున్నారు. ములకల్లంక చేరుకోవడానికి ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి అడ్డువచ్చినప్పటికీ నాటుపడవపై గ్రామం చేరుకుని వృద్ధురాలిని అదే పడవలో తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేసి రాజమండ్రి ఆసుపత్రికి తరలించి రక్షించారు. దీంతో కుటుంబీకులు ఆనందం వ్యక్తంచేశారు. ప్రాణాలకు తెగించి పనిచేసిన సిబ్బందిని 108 డిస్ట్రిక్ట్ మేనేజర్ దాసరి రాజు అభినందించారు.

జీఎస్టీ తగ్గింపుతో
ఆర్థిక ప్రయోజనం

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు



శ్రీకృష్ణపట్నంలో అవగాహన ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

దివాన్‌చెరువు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జీఎస్టీను తగ్గించడం ద్వారా సామాన్యులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శ్రీకృష్ణపట్నంలో ఏర్పాటు చేసిన మహిళల కుట్టుమిషన్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎస్టీ 2.0పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సంస్కరణలతో పలు వస్తువుల ధరలు తగ్గుతాయని, తద్వారా పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాసేన కోసం నా వంతు కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, సర్పంచ్ కిమిడి శ్రీరామ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కడియం: కడియంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ఎంపీపీ వెలుగుబంటి వెంకటసత్యప్రసాద్, ఎంపీడీవో కె.రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. సచివాలయాల స్థాయిలో సమావేశాలు, సూపర్ మార్కెట్లు, పలు వాహన షోరూమ్‌లు, దుకాణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో పాత ధరలు, కొత్తధరల మార్పులు వివరించారు. పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందికి ఆయా గ్రామాల పరిధిలో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు.

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు, బలభద్రపురం పంచాయతీల్లో సర్పంచ్‌లు సరెళ్ల సుమలత, బుంగా రామారావుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో అవగాహన ర్యాలీలు జరిపారు. మానవహారాలు ఏర్పాటు చేశారు. షాపులను పరిశీలించి జీఎస్టీ అమలును పరిశీలించారు.కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని అమలు చేయకపోతే వ్యాపారులపై చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి తోట శ్రీదేవి ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి ఎస్.జాన్‌శామ్యూల్, ఏవో నాగేంద్రప్రసాద్, ఏపీఎం సుప్రియ, కూటమి నాయకులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, వెంకన్నబాబు, పవన్, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు డీఆర్ఎన్ పద్మజ, అచ్చియ్యచౌదరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని పిడింగొయ్యి పంచాయతీ పరిధి కవలగొయ్యి గ్రామంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గ్రామంలోని ఇంటింటికీ, వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కలిగించారు.

పేద మధ్యతరగతికి ఊరట: వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక 25వ డివిజన్‌లో నేతాజీ స్కూల్, అన్నపూర్ణ థియేటర్‌ల వద్ద సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణలతో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభిస్తుందన్నారు. జీఎస్టీ నాలుగు శ్లాబులను రెండుకి కుదించారని, పేద మధ్య తరగతి ప్రజలకు నెలకు రూ.15 వేలు ఆదా అయ్యే విధంగా ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లు నిర్ణయం తీసుకున్నారన్నారు. అనంతరం ప్రతీవ్యాపార సంస్థకు వెళ్లి జీఎస్టీ సేవింగ్స్ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, కాశీ నవీన్‌కుమార్, దొండపాటి సత్యంబాబు, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, మజ్జి రాంబాబు, వై.శ్రీనివాస్, రెడ్డి మణేశ్వరరావు, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణ, అర్లపల్లి బోస్ తదితరులు పాల్గొన్నారు.

గోకులంతో పశువుల శాలల నిర్మాణం

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
కవలగొయ్యి కొత్తతుంగపాడులో షెడ్‌ల నిర్మాణానికి శంకుస్థాపనలు



కవలగొయ్యిలో షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గోకులం పథకం ద్వారా వేగంగా పశువుల శాలలు నిర్మాణాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని పిడింగొయ్యి పంచాయతీ పరిధి కవలగొయ్యి గ్రామంలో గోకులం పథకంలో భాగంగా పశువుల శాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా గోకులాలకు 90శాతం నిధులు ప్రభుత్వం భరిస్తుందని, 10శాతం లబ్ధిదారుడు చెల్లిస్తే సరిపోతుందన్నారు. రెండు పశువుల ఉన్న శాల నిర్మాణానికి యూనిట్‌కు రూ.1,15,000 కాగా ఇందులో రూ,11500 మాత్రమే లబ్ధిదారుడు చెల్లించాలని, మిగిలిన రూ.1,05,500 ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ పథకంలో మండలానికి 50యూనిట్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 24 మందిని ఎంపిక చేశారన్నారు. మిగిలిన యూనిట్లకు అర్హులైన, పశువులు కలిగిన రైతుల దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవరావు, మత్యేటి ప్రసాద్, ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి డి.సూర్యనారాయణ, మట్టా శ్రీను, బొప్పన శ్రీను, కోరాడ వెంకటేశ్, మార్ని దొరబ్బాయి, బొప్పన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్థక రంగం అభివృద్ధి: బత్తుల

దివాన్‌చెరువు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం కొత్తతుంగపాడులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే గోకులం షెడ్ శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్థక రంగం అభివృద్ధికి, రైతు కుటుంబాల ఆర్థిక బలోపేతానికి ఈ తరహా పథకాలు ఎంతో తోడ్పడతాయన్నారు. గ్రామాల్లోని పాడి రైతులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వాణి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో భ్రమరాంబ, ఈసీ బాలరాజు నాయకులు పాల్గొన్నారు.

ఏపీపీ రోడ్డులో నూతన భవనాన్ని
తనిఖీ చేసిన కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఏవీఏ రోడ్డులోని నూతనంగా నిర్మించిన ప్రసాద్ ఆదిత్య మల్టీప్లెక్స్ భవనాన్ని కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ కీర్తి చేకూరి తనిఖీ చేశారు. శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి ఆ నూతన భవనం ప్లాన్ ప్రకారం సక్రమంగా ఉన్నదీ, లేనిదీ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అందరికీ భద్రత, భవన నిర్మాణ స్థిరత్వం, ఇతర అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భవనానికి ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసే సమయంలో అన్ని నియమాలు, నిబంధనలు పూర్తిగా పరిశీలించాలని అధికారులకు ఇన్‌చార్జి కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె వెంట సీపీ కోటయ్య, రుడా సీపీవో జీవీఎస్ఎన్ మూర్తి, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

ఆదర్శప్రాయుడు గాంధీజీ

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
ఘనంగా మహాత్మాగాంధీ, లాలాబహదూర్ శాస్త్రి జయంతి



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): భారతదేశపు స్వాతంత్ర్య సంగ్రామంలో కోట్లాది మంది జాతిపిత మహాత్మగాంధీని ఆదర్శంగా తీసుకున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం రాజమహేంద్రవరం దానవాయిపేటలోని గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటం చేసారని గుర్తుచేశారు. గాంధీజీ సత్యం, అహింస మార్గంలో సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాల్లో భారతీయులందరినీ భాగస్వాములను చేశారన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశీ నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, నక్కాదేవి వరప్రసాద్, మజ్జి రాంబాబు, ఉప్పులూరి జానకిరామయ్య, కరగాని వేణు, జవ్వాది మురళీకృష్ణ, కోరుమిల్లి విజయశేఖర్, టి.బాబి పాల్గొన్నారు.

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతి వేడులను నిర్వహించారు. ఎంపీపీ తేతలి సుమ.. గాంధీజీ, శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఎంపీడీవో వి.శ్రీనివాస్, ఏవో నాగేంద్రప్రసాద్, నాయకులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, తేతలి సూర్యచంద్ర, ఓవీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కడియం: జై జవాన్, జై కిసాన్ సేవా సంస్థ అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు ఆధ్వర్యంలో కడియం గ్రామంలోని బొబ్బిలి బ్రిడ్జి సెంటర్‌లో మహాత్మాగాంధీ, లాలాబహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు జరిగాయి. వారి చిత్రపటాలకు ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత రక్ష ణ శాఖకు కావాల్సిన యుద్ధ పరికరాల మెటల్ సామగ్రి తయారు చేసే మిధాని సంస్థలో సీనియర్ శాస్త్రవేత్తగా సేవలందిస్తున్న కొండేపూడి చంద్రావతి, కార్గిల్ యుద్ధ వీరుడు సలారి ఎస్. గోవిందరావు, ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతు అన్నందేవుల చంటి, ఉత్తమ ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, గొల్లపల్లి సత్యనారాయణలకు జై జవాన్, జై కిసాన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సేవా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, ఆదిమూలం సాయిబాబా, బొర్సు సుబ్రహ్మణ్యం, గారపాటి తాతబ్బాయి, చిక్కాల శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక జాంపేట గాంధీ బొమ్మ వద్ద, మహాత్మా గాంధీ విగ్రహానికి జాంపేట దేవాంగ సంక్షేమ సంఘ సభ్యులు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలెపు గణేష్, గంపా గిరిజా శంకర్, పింజర్ల సాంబశివరావు, కొడమటి జగన్మోహనరావు, కర్రా ప్రకాష్, ఆకాశపు సాంబ, పూర్ణిమ ప్రసాద్ పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని అనపర్తి, రామవరం గ్రామాల్లో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మహాత్ముడి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం మహాత్ముడు అనుసరించిన శాంతి మార్గంలో ప్రజలు పయనించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి.. రంగంపేటలో రూ.2.55 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



రంగంపేటలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో రహదారులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఉపాధి హామీ నిధులు రూ.2.20 కోట్లతో చేసే రంగంపేట-గండేపల్లి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే వెంకటదాసు చెరువు నుంచి బరియల్ గ్రౌండ్‌కు వెళ్లే సీసీ రోడ్డును ప్రారంభించారు.గ్రామానికి చెందిన రైతులు పోతుల పద్మారావు, కంటిపూడి శ్రీనివాస్ కొనుగోలు చేసిన ట్రాక్టర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగంపేట-గండేపల్లి రోడ్డుకు 2017 చివరిలో నారా లోకేశ్ పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రూ.1.70 కోట్లు మంజూరు చేయగా 70శాతం పనులు జరిగాయని, తర్వాత వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. మళ్లీ కూటమి వచ్చాక ఈ రోడ్డు అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మీ, జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, వెలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, పోతుల వెంకట్రావు, ఉండవిల్లి గిరిబాబు, ఉద్దండ్రావు శ్రీను, కొమ్మనరాంబాబు పాల్గొన్నారు.

పెదపూడి రైతుల ధ్యానాన్ని
బిక్కవోలులో అమ్ముకునే వీలు కల్పించాలి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే నల్లమిల్లి వినతి

బిక్కవోలు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలంలోని రైతులు పండించిన ధాన్యాన్ని బిక్కవోలు మండలంలోని రైసు మిల్లులకు అమ్ముకునేందుకు వీలు కల్పించాలంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెదపూడి.. బిక్కవోలును ఆనుకుని వుందని, ఇక్కడకు ధాన్యం రవాణా చేయడానికి తక్కువ ఖర్చవుతుందన్నారు. పెదపూడిలో పంట ఎక్కువ రైసు మిల్లులు తక్కువని, గత ప్రభుత్వంలో రైతుల అభిష్టానికి వ్యతిరేకంగా దూరప్రాంతంలో వున్న రైస్‌మిల్స్‌కు అమ్ముకునే విధంగా వ్యవహరించడం వల్ల తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఈ విషయమై ఈనెల 19న పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం పంపినట్టు తెలిపారు. చంద్రబాబు ప్రతిపక్షనేతగా రైతు దగ్గరలో ఏమిల్లు వుంటే అక్కడే అమ్ముకోవచ్చునన్నారని ప్రకటించారన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నా పెదపూడి రైతులకు అన్యాయం జరుగుతోందని మంత్రికి వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. ఈవిషయమై కలెక్టర్ కీర్తి పెదపూడి రైతులకు అనుకూలంగా ఉత్తర్వులు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు.

గ్రాసిం ఇండస్ట్రీస్‌కు
స్వచ్ఛ పరిశ్రమల అవార్డు


బిక్కవోలు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండ లంలోని బలభద్రపురంలోని గ్రాసిం ఇండస్ట్రీస్ స్వచ్ఛ పరిశ్రమల అవార్డు దక్కించుకుందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో 15 రంగాల్లో 51 అవార్డులు ఇచ్చా రని, పరిశ్రమల రంగం నుంచి గ్రాసిం ఇండస్ట్రీస్ అవార్డు పొందింది. ఈనెల 6న సంస్థ ప్రతినిధి ఎస్ఎస్ శాస్త్రి అవార్డు అందుకోనున్నారు.

అనపర్తిలో మహా సౌరశక్తి యాగం

అనపర్తి అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అనపర్తికి చెందిన సూర్యోపాసకులు నల్లమిల్లి విక్రమాదిత్యరెడ్డి ఆధ్వర్యంలో మహా సౌరశక్తి యాగం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూర్యభగవానున్ని దర్శించుకుని మహా సౌరశక్తి యాగంలో పాల్గొన్నారు. విక్రమాదిత్య మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుడికి మహా సౌరశక్తి యాగం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజయదశమి సందర్భంగా మండలంలోని అమ్మవారి పీఠాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 4 అక్టోబరు 2025 | 5



ఎస్పీ దంపతుల ఆయుధ పూజ

రాజమహేంద్రవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయ దశమి సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సాయుధ రిజర్వు పోలీసు జిల్లా ప్రధాన కార్యాలయంలో ఎస్పీ నరసింహ కిశోర్ దం పతులు ఆయుధ పూజ చేశారు. దుర్గామాత విగ్రహానికి, పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గాంధీజీ, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు.చిత్రపటాలకు ఎస్పీ దంపతులు పూలమాలలు వేశారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఏవీ సుబ్బరాజు,ఎల్.చెంచిరెడ్డి,ఎస్బీ డీఎస్పీ రామకృష్ణ పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు.. ఆనందం

- 35,538 మంది అర్హులు
- ఒక్కో డ్రైవర్‌కు రూ.15 వేలు
- నేడు ఖాతాల్లో రూ.53 కోట్లు

(రాజమహేంద్రవరం అర్బన్ - ఆంధ్రజ్యోతి)

సూపర్ సిక్స్ పథకాల అమలుతో సక్సెస్‌ఫుల్ పాలన దిశగా వెళుతున్న కూటమి సర్కారు ఈ సారి ఆటోకార్మికులకు అండగా నిలుస్తోంది.స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన ప్రభుత్వం.. తాజాగా 'ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన ఆటో డ్రైవర్లు, మాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థికసాయం అందజేయనుంది. శనివారం ఉమ్మడి జిల్లాలోని అర్హులైన డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో రూ.53 కోట్ల సొమ్ము వేయనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36,630 మంది డ్రైవర్లు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 14,722 మంది దరఖాస్తు చేసుకోగా 12966 మందిని అర్హులుగా ప్రభుత్వం నిర్ధారించారు. తూర్పుగోదావరి జిల్లాలో 13,147 మంది దరఖాస్తు చేసుకోగా 11,915 మంది అర్హులుగా తేలింది. 172 దరఖాస్తులు తిరస్కరించగా 81 దరఖాస్తులను హోల్డ్‌లో ఉంచింది. కోనసీమ జిల్లాలో స్వల్పంగా 8,491 దరఖాస్తులే దాఖలయ్యాయి.7709 దరఖాస్తులకు అధికారులు ఆమోదముద్ర వేశారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 35,538 మంది దరఖాస్తులకు ఆమోదం లభించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అర్హులైన ఆటోడ్రైవర్లకు రూ.11.56 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 11,915 మంది ఆటో డ్రైవర్లకు రూ.17.87 కోట్లు, కాకినాడ జిల్లాకు సంబంధించి రూ.19.45 కోట్లు ఆర్థిక సాయం అందించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులందరికీ రూ.15 వేల చొప్పున రూ.53 కోట్ల నగదు శనివారం బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా అమరావతి నుంచి శనివారం కార్యక్రమం ప్రారంభిస్తారు. తూర్పుగోదావరి జిల్లా కార్యక్రమం రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో శనివారం ఉద యం 10 గంటలకు నిర్వహిస్తారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి నిమ్మల రామానాయుడు హాజరవుతారు. నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభిస్తారు. ఈ మేరకు ఎక్కడికక్కడ రవాణా అధికారులు ఏర్పాట్లు చేశారు.

దేశంలో మరోసారి స్వదేశీ ఉద్యమం : మాధవ్



రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్య మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖాదీ సంతను చివరి రోజైన శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు.



తల్లీ నిను దుంచి!

నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయం విజయదశమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక స్వర్ణాభరణాలు, పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. - నిడదవోలు



డిజిటల్ అరెస్ట్!

సెట్టు వేస్తారు.. సెట్ చేసి కొట్టేస్తారు!

మోసం ఇలా..

ఇతర రాష్ట్రాల నుంచి సైబర్ నేరగాళ్లు వివిధ ప్రాంతాల్లోని డాక్టర్లు, బడా వ్యాపారులు, విశ్రాంత ఉద్యోగుల వివరాలు తెలుసుకుంటారు. దీని కోసం స్థానికంగా ఉన్న యువకులకు ఉద్యోగాలిచ్చి ఆయా ప్రాంతాల్లోని ప్రముఖుల నెంబర్లు సేకరించి తతంగం ఆరంభిస్తారు. ఓ గదిలో పోలీస్ అధికారి గది మాదిరిగా సెట్టు వేస్తారు. స్కైప్, వాట్సాప్, టెలిగ్రాం ద్వారా కాల్ చేస్తారు. డీపీలు పోలీసుల డ్రెస్సుల్లో ఫొటోలే ఉంటాయి. ఎస్పీ, డీఐజీ, ఐజీ వంటి పెద్ద హోదాల పేర్లతో పరిచయం చేసుకుని ఐడీ కార్డు చూపిస్తారు. వివిధ కారణాలను చూపుతూ ఆయా వ్యక్తుల అనుమానులకు అనుగుణంగా భయపెడతారు. ఎవరైనా కాస్త వాయిస్ పెంచి ప్రశ్నిస్తే నకిలీ అరెస్టు వారెంట్లు మెసెంజర్ ప్లాట్ ఫాంల ద్వారా పంపిస్తారు. ఎవరికైనా ఈ విషయం చెబితే ఇంటికి వచ్చి సంకెళ్లు వేసి తీసుకెళతామని బెదిరిస్తారు. కేసులో ఉన్న సొమ్మును డిపాజిట్ చేయాలని హుకుం జారీ చేస్తారు. ఒక వేళ నిర్దోషి అని తేలితే వెనక్కి ఇచ్చేస్తామంటారు. సైబర్ కేటుగాళ్లు తాము చెప్పిన చిన్న చిన్న బ్యాంకు ఖాతాలకు ఆర్టీజీ ఎస్ ద్వారా సొమ్ములు జమ చేసుకుంటారు. వాటిని వెంటనే డ్రా చేసేస్తారు. లేదా భారీ కొనుగోళ్లకు ఈ డబ్బులను చెల్లిస్తారు.

డిజిటల్ అరెస్ట్ లేనేలేదు..

సెట్టు వేసి డబ్బులు కొట్టేయడమే డిజిటల్ అరెస్టులో ముఖ్యాంశం. ఇటువైపు వ్యక్తి భయం పైనే పూర్తిగా ఆధారపడి మోసం చేస్తారు. అక్రమంగా సంపాదించిన వాళ్లు తమ లావాదేవీలు బయట పడతాయనే భయంతో కొందరు మోసపోతున్నారు. ఇందులో ఎక్కువగా డాక్టర్లు, ప్రభుత్వ అధికారులు ఉండడం గమనార్హం. డిజిటల్ అరెస్టు చట్టంలో ఎక్కడా లేదు. కేవలం ఊహ మాత్రమే.

రాజమహేంద్రవరంలో ఓ ప్రముఖ డాక్టర్‌కి స్కైప్ ద్వారా వీడియోకాల్ వచ్చింది. అవతల యూనిఫాంలో ఉన్న ఓ పోలీసు ఉన్నతాధికారి మాట్లాడుతున్నారు. ఆ అధికారి కూర్చున్న గదిలో జాతీయ పతాకం, బ్యానర్ వంటివన్నీ ఉన్నాయి.. మీరు విదేశాలకు హవాలా ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు పంపిస్తున్నట్టు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నాడు. అరెస్టు వారెంట్, ఏవేవో పోలీస్ ముద్రలతో ఉన్న పత్రాలను చూపించాడు. డిజిటల్ అరెస్టు చేస్తున్నామని చెప్పారు. ఎవరికైనా ఈ విషయం చెబితే ఇంటికొచ్చి అరెస్టు చేస్తామని భయపెట్టారు. ముందుగా మనీ లాండరింగ్‌లో తాము గుర్తించిన రూ.3.50 కోట్లు డిపాజిట్ చేయాలని..కేసులో మీ ప్రమేయమేమీ లేదని తేలితే ఆ డబ్బు తిరిగి ఇచ్చేస్తామని చెప్పాడు. ఆ డాక్టరు దఫదఫాలుగా నెల రోజుల్లో రూ.3.50 కోట్లు డిపాజిట్ చేసేశాడు. ఆ తర్వాత విషయం తెలిసింది. ఆ డాక్టరు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఓ రూ.40 లక్షలు హోల్డు చేశారు. మిగతా సొమ్ము సైబర్ నేరగాళ్లు స్వాహా చేసేశారు..

- (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇది మరోచోట జరిగిన ఘటన.. డిజిటల్ అరెస్టు అంటూ ఓ 35ఏళ్ల లేడీ డాక్టర్‌ను భయపెట్టి వివస్త్రను చేశారు. ఫలానా చోట పుట్టుమచ్చలు ఉంటే మీరే నిందితులని, తమకు నిర్ధారణ చేయాలంటూ పోలీస్ దుస్తుల్లో ఉన్న కేటుగాళ్లు నమ్మించారు. స్క్రీన్ రికార్డింగ్ ద్వారా ఆ మహిళ వివస్త్రగా ఉన్న వీడియో తీశారు. అది చూపించి రూ.8 లక్షలు దోచేశారు.

ఇది రాజమహేంద్రవరంలోనే జరిగిన ఘటన.. సింగరేణి కాలరీస్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ తర్వాత ఇక్కడ స్థిరపడ్డారు. ఆయనకు స్కైప్ కాల్ వచ్చింది. హవాలాలో అతని అకౌంట్ ద్వారా విదేశాలకు డబ్బు వెళ్లిందని, కేసులు తేలే వరకూ డిజిటల్ అరెస్టులు చేస్తున్నామని చెప్పారు. రూ.60 లక్షలు దోచేశారు. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏడాదిలో 20 కేసులకుపైగా నమోదయ్యాయి. రాజమండ్రికి చెందిన ఎయిర్ పోర్ట్ విశ్రాంత ఉద్యోగిని కూడా వారం రోజులు డిజిటల్ అరెస్టు పేరుతో ఇంట్లో నిర్బంధించేశారు.

డిజిటల్ అనే పదాన్ని ఉపయోగించి ఏకంగా అరెస్టులు చేసేస్తున్నారు. బాగా చదు వుకున్నోళ్లు సులభంగా అరెస్టై, కాలు కదప డం లేదు. ఆర్థిక నేరాలకు సంబంధించి డిజిటల్ అరెస్టు ఓ పెద్ద సమస్యగా పరిణమించింది. కస్టమ్స్, ఆదాయపు పన్ను శాఖ, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీల అధికారులుగా వ్యవ హరిస్తూ పేరున్న వ్యక్తులు, ప్రముఖులు, ధన వంతులను మోసం చేసి డబ్బు కాజేస్తు న్నారు.ప్రధాని మోదీ సైతం 'మన్ కీబాత్' రేడియో ప్రసంగంలో డిజిటల్ అరెస్టుల బా రినపడొద్దని హెచ్చరించారంటే..ఊహాజనిత అరెస్టు సమాజంపై ఎంతటి ప్రభావం చూపిస్తోందో అర్థం చేసుకోవచ్చు.

- ఉమ్మడి జిల్లాలో 20కిపైగా కేసులు
- ప్రముఖులే టార్గెట్‌గా వ్యవహారం
- అక్రమ లావాదేవీలే పెట్టుబడి
- భయపెట్టి భారీగా లాగుడు
- మోసపోతున్న ఉన్నత చదువరులు
- రూ.3.50 కోట్లు ఇచ్చేసిన ఓ డాక్టర్
- వివస్త్రగా మారిన ఓ లేడీ డాక్టర్
- డిజిటల్ అరెస్టు.. చట్టంలో లేదు
- డబ్బు దోపిడీకి గురైతే వెనక్కి రాదు
- అప్రమత్తతే ఆయుధం

డౌట్ వస్తే.. డయల్ 112

కాల్ వస్తే వ్యక్తిగత, ఆర్థిక, బ్యాంకు తదితర సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదు.ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు చెప్పకూడదు. లింక్‌లను క్లిక్ చేయకూడదు. ఫోన్‌లో కాల్- బ్లాకింగ్ ఉపయోగించడం ద్వారా మోసపూరిత నెంబర్లు బ్లాక్ చేయవచ్చు. సైబర్ మోసగాళ్లని అనుమానం వచ్చిన వెంటనే 112కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఒకవేళ అప్పటికే మోసపోతే 1930కి ఫిర్యాదు చేయవచ్చు. నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ నేరాల్లో ఒకసారి డబ్బు నేరస్తుల చేతిలోకి వెళితే తిరిగి మళ్లీ మన చేతుల్లోకి రావడం దాదాపుగా అసాధ్యమని చెప్పవచ్చు. ఒకవేళ అప్పటికే మన అదృష్టం కొద్దీ బ్యాంకు ఖాతాలో మిగిలిన సొమ్మును పోలీసులు హోల్డు చేసినా.. కోర్టు, బ్యాంకుల నిబంధనలను దాటుకొని మన జేబులోకి వచ్చేసరికి కనీసం ఏడాది పడుతుంది.

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రకు 54 అవార్డులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమానికి సంబంధించి రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డుల పంట పండింది. మూడు రాష్ట్ర స్థాయి అవార్డులు, 51 జిల్లా స్థాయి అవార్డులు వచ్చినట్టు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ప్రకటించారు.ఈ నెల 6న జరిగే జిల్లాస్థాయి కార్యక్రమాల్లో అవార్డులు అందజేస్తారు. ప్రజా ప్రతినిధులు,అధికారులు, సిబ్బంది, ప్రజల కృషికి నిదర్శనమే అవార్డులని కలెక్టర్ తెలిపారు.జిల్లాకు వచ్చిన గుర్తింపులో భాగస్వాములైన ప్రతి వ్యక్తి,గ్రామం, పాఠ శాల,ఆసుపత్రి, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలకుఅభినందనలు తెలిపారు.

15 వరకూ స్కాలర్‌షిప్ దరఖాస్తులకు గడువు

రాజమహేంద్రవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) కు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో వాసుదేవరావు సూచించారు. ప్రభుత్వ పరీక్షల వెబ్‌సైటు www.bse.ap.gov.inలో దరఖాస్తు అందుబాటులో ఉందన్నారు. పరీక్ష ఫీజు ఈ నెల 16లోపు చెల్లించాలని, ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రశీదు డీఈవో కార్యాలయంలో ఈ నెల 18 వరకూ సమర్పించవచ్చని తెలిపారు.

జీఎస్టీపై అవగాహన

రాజమహేంద్రవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణలతో నూతనాధ్యాయం వైపు అడుగులు పడుతున్నాయని జిల్లా జీఎస్టీ (రాష్ట్ర) శాఖ జాయింట్ కమిషనర్ బి.సుధాకర్ తెలిపారు. స్థానిక ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.జీఎస్టీ రిటర్న్ ఫైలింగ్‌లో చేపట్టిన సంస్కరణలు,పారదర్శకతకు దోహదం చేస్తున్నాయని చెప్పారు. డిజిటల్ విధానంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని గుర్తు చేశారు. జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్ రూ పంలో వ్యాపార సౌలభ్యం, వినియో గదారుల రక్షణ, పారదర్శకత మరింత పెరుగుతుందన్నారు.కార్యక్రమంలో పలు వురు వ్యాపారులు,డీలర్లు పాల్గొన్నారు.



పుష్కరాలకు ప్రణాళికలు రూపొందించండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు -2027 పనులకు అంచనాలు రూపొందించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్,జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు.రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో శుక్రవారం అన్ని విభాగాల అధికారులతో సమీక్షించారు. తొలుత 21 రహదారుల విస్తరణకు సంబంధించి రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు.కోరుకొండ రోడ్డు, తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు, మోరంపూడి రోడ్డు జంక్షన్ నుంచి శ్యామల సెంటర్ వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టవలసిన ఆవశ్యకత ఉందన్నారు.పుష్కరాల క్రౌడ్ మేనేజ్‌మెంట్, ఘాట్ల అభివృద్ధి, ట్రాఫిక్ మళ్లింపు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేష న్‌పై చర్చించారు. కేవలం పుష్కరాల పేరుతో తాత్కాలిక ఏర్పాట్లు చేయకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని నిర్ణయించారు. దీర్ఘకాలిక విధానంలో రహదారుల విస్తరణ, మౌలిక వసతులు కల్పన, పర్యాటకంగా నగరాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్,డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, సిటీ ప్లానర్ కోటయ్య, రుడా సీపీ వో జీవీఎస్ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గోదాములపై దృష్టి పెట్టండి : జేసీ

కొవ్వూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ కేంద్రాలు, గోదాముల వద్ద పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని జేసీ వై.మేఘాస్వరూప్ అధికారులను ఆదేశించారు. కొవ్వూరు మండలం పంగిడిలో శుక్రవారం జేసీ, జీఎస్టీ నోడల్ అధికారి వై.మేఘాస్వరూప్ పర్యటించారు. ముందుగా జీఎస్టీ తగ్గింపుపై చేపట్టిన ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. బాణసంచా గోదాములను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బాణసంచా తయారీ కేంద్రాలు, గోదాముల వద్ద ఫైర్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసి భద్రతా ప్రమాణాలు పరిశీలించాలన్నారు.సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ద్వారా ప్రజలకు లభించే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్లు ఎం.దుర్గాప్రసాద్, ఎం.మెరికమ్మ,ఫైర్ అధికారి ఏవీఎస్ఎన్.వేణు ఉన్నారు.



దీపావళి బాణసంచా గోదాములు పరిశీలిస్తున్న జాయింటు కలెక్టర్ వై.మేఘాస్వరూప్

వేములూరు పంచాయతీలో విచారణ

కొవ్వూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వేములూరు పంచాయతీ నిధులు దుర్వినియోగంపై అధికారులు విచారణ చేపట్టారు. కొవ్వూరు మండలం వేములూరు పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని సెప్టెంబరు 16వ తేదీన సభ్యులు డీసెంటు ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు గ్రామ నాయకులు వినతిపత్రం అందజేయడంతో విచారణ చేపట్టాలని డీఎల్ పీవోను ఆదేశించారు.ఈవోపీఆర్‌ఆర్‌డీ బీహెచ్ఎస్.ప్రకాశరావు శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, నాయకుల సమక్షంలో విచారణ చేపట్టి ఫైల్స్‌ను సీజ్‌చేసి తీసుకెళ్లారు. రెండు,మూడు రోజుల్లో డీఎల్‌పీవోకు నివేదిక అందజేస్తానని ఈవోపీఆర్‌ఆర్‌డి ప్రకాశరావు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

అధికారులను ఆదేశించిన కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక వ్యవసాయ పద్ధతులు అనుసరించడం ద్వారా ప్రకృతి వ్యవసాయంలో కూడా అధిక దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖపై శుక్రవారం సాయంత్రం సమీక్షించారు. ఖరీఫ్ సీజన్ వరి పంటలో ఇప్పటి వరకు 99.24 శాతం ఈ పంట నమోదు జరగగా మొత్తం అన్ని పంటలూ కలిపి 71.54 శాతం నమోదైందన్నారు. అక్టోబరు 30 నాటికి 100శాతం ఈ పంట నమోదు పూర్తి చేయాలని సూచించారు. రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. రైతులు వరి పంటలో కృత్రిమ ఎరువులు తగ్గించి సహజ పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడి సాధ్యమవుతుందన్నారు. డ్వాక్రా మహిళలను గుర్తించి రాయితీపై వ్యవసాయ డ్రోన్లు అందించడం ద్వారా వారికి ఉపాధి కల్పించవచ్చని సూచించారు. కౌలు కార్డు కలిగిన ప్రతి కౌలు రైతుకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని.. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని గుర్తించి ఆ గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, డీపీఎం తాతారావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మేముసైతం!

గాంధీ జయంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం కోటిలింగాలఘాట్‌లో గురువారం తమ సిబ్బందితో సీఆర్పీఎఫ్ 42వ బెటాలియన్ కమాండెంట్ ధర్మప్రకాశ్ స్వచ్ఛతా అభియాన్ నిర్వహించారు. మెట్లు శుభ్రం చేశారు. - రాజమహేంద్రవరం



పన్ను..పోటులేదు..

జీఎస్టీపై ఊరూవాడా అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ కవలగొయ్యిలో శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ర్యాలీ చేశారు. ఆయనతో నాయకులు జతకలిశారు. - రాజమహేంద్రవరం రూరల్

కార్మిక హక్కులను కాపాడాలి : ఐఎఫ్‌టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న గ్రీష్మకుమార్

నిడదవోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): షాపింగ్ మాల్స్, ప్రైవేట్ వ్యాపార సంస్థలు, కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికుల పని గంటల సమయాన్ని ఎనిమిది గంటల నుంచి 10 గంటల వరకు పెంచడాన్ని కార్మిక వర్గమంతా ఖండిస్తుందని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. శుక్రవారం ఇందిరానగర్‌లో కార్మిక హక్కులను కాపాడాలంటూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు రవా సురేష్ మాట్లాడుతూ కార్మికులు సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో చట్టరూపంలో తేవడం కార్పొరేటర్ల ఒత్తిడి మేరకు మోదీ విధానాలకు తలొగ్గడమే అని అన్నారు. గుంటు రాజీవ్, యాదాల రమణ, యెల్లమిల్లి కార్తీక్, బాలు, రత్తయ్య, పాలంగి చంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు


పూజలు నిర్వహిస్తున్న మహిళలు

చాగల్లు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో దేవీ నవరాత్రులు వేడుకగా జరిగాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం చాగల్లు కనకదుర్గమ్మ వారి ఆలయంలో కుంకుమ పూజలు జరిగాయి. వందలాది మంది మహిళలు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో పూజలు ఘనంగా జరిగాయి. అలాగే చాగల్లు గ్రామదేవత పాటెమ్మవారి నవరాత్రులూ వేడుకగా జరిగాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

దేవరపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో విజయదశమి మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని జమ్మిచెట్టికి ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ అచార్యులు సెమీపూజ చేశారు. సాయంత్రం రాజమహేంద్రవరానికి చెందిన సత్యశ్రావణి శిష్య బృందం ఆధ్వర్యంలో రాజమండ్రి, దేవరపల్లి మండలంలోని విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, సభ్యులు గుడ్ల వెంకటేశ్వరరావు, జీ.వెంకటేశ్వరరావు, కొండపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : పీడీ


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ బుజ్జి

కొవ్వూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల గృహాలు పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు జిల్లా హౌసింగ్ పీడీ ఎన్.బుజ్జి తెలిపారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో శుక్రవారం గృహనిర్మాణాల ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పీడీ బుజ్జి మాట్లాడుతూ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి. దీనిపై ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్దిదారులు గృహ నిర్మాణం చేపట్టేలా చైతన్యవంతం చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ సీహెచ్ వేణుగోపాలస్వామి, డీఈ శేఖర్‌బాబు, ఏఈలు డీఎస్ చాంబర్లిన్, కేఎస్ చక్రవర్తి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెండ్యాల గోదావరి వద్ద వ్యక్తి గల్లంతు

నిడదవోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పెండ్యాల ఏటిగట్టు వద్ద గురువారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన ఉల్లూరి చిరంజీవి (64) ప్రమాదవశాత్తు కాలుజారి గోదావరిలో గల్లంతయ్యాడు. రెవెన్యూ, పోలీస్ అధికారులు గాలింపుచర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న మంత్రి దుర్గేష్ సంతాపం వ్యక్తం చేశారు. గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు.

సూపర్ జీఎస్టీ 2.0 పై అవగాహన ర్యాలీలు


జీఎస్టీ తగ్గింపు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే , ఆర్డీవో

కొవ్వూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనిముట్లతో పాటు పరికరాలపై జీఎస్టీ తగ్గించి కూటమి ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే, ఆర్డీవో రాణీసుస్మిత పాల్గొని ప్రజలకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ జీఎస్టీ తగ్గింపు వల్ల రైతులకు చేకూరుతున్న లబ్ధిని వివరించారు. ఆర్డీవో రాణీసుస్మిత, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించడం వల్ల సాగులో రైతులకు ఆర్థికభారం తగ్గడంతో పాటు యంత్రాల వినియోగపు శక్తి పెరుగుతోందన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, కుమారదేవం పంపింగ్ స్కీమ్ అధ్యక్షులు గొరిజాల సురేష్, మున్సిపల్ కమిషనర్ గ్రంధి సందీప్, కౌన్సిలర్లు పాలూరి నీలిమ, మురుకొండ రమాదేవి, వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: సూపర్ జీఎస్‌టీ 2.0 పై తాళ్లపూడి వర్తక సంఘం, సీటీవో అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జీఎస్టీ 2.0 కింద అనేక రకాల నిత్యావసర వస్తువులపై భారీగా పన్నులు తగ్గించే చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయన్నారు. కార్యక్రమంలో తాళ్లపూడి వర్తకసంఘం సభ్యులు కంకిపాటి వెంకట్రావు, నక్కా ఆనంద్ కుమార్, కంకిపాటి సత్యసాయి, సొలస రాంబాబు, డీసీటీవో కే. సుబ్రహ్మణ్యం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం : జీఎస్టీ 2.0 తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక ఉపశమనం కలిగిందని టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదేశాల మేరకు ముఖ్యకేంద్రమైన గోపాలపురంలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ కార్యాలయం నుంచి చెక్‌పోస్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మోర్త సొసైటీ వద్ద రైతులకు నిర్వహించిన జీఎస్టీ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు కొనుగోలులో జీఎస్టీ తగ్గిందన్నారు. రైతులు ఈ విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కరుటూరి వెంకటవర ప్రసాద్, ఎంపీడీవో ఎమ్. శ్రీనివాసరావు, ఏవో బీ. రాజారావు, ఎంపీడీవో ఆఫీసు ఏవో వీఎస్ రామారావు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కానూరు సొసైటీలో వీడ్కోలు సభ

పెరవలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కానూరు సొసైటీలో కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ పొందిన గంధం సత్యనారాయణ, మరో ఉద్యోగి కంటపూడి చిన్నారావును శుక్రవారం సొసైటీలో వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు వాకలపూడి వీర్రాజు మాట్లాడుతూ సొసైటీకి వారు అందించిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. సొసైటీ సిబ్బంది, త్రిమెన్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సూపర్ సేవింగ్స్‌పై అవగాహన


చాగల్లు రైతుసేవా కేంద్రం వద్ద అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చాగల్లు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చాగల్లు రైతు సేవా కేంద్రం వద్ద జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రదర్శించి తగ్గింపు రేట్లు గురించి రైతులకు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు మాట్లాడుతూ రైతులకు మేలు జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం జీఎస్టీ పన్నుల రేట్లు బాగా తగ్గించిందన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీ సీహెచ్ శ్రీనివాస్, ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, తహశీల్దార్ ఎం. మెరికమ్మ, ఏవో కే. వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములూరులో ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్త చిన్నం రవికుమార్ కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. టీడీపీ క్రియాశీలక సభ్యుడు రవికుమార్ కుటుంబానికి పార్టీ తరపున భరోసా కల్పిస్తూ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు పంపించిన చెక్కును శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. భవిష్యత్‌లో రవికుమార్ కుటుంబానికి పార్టీ అన్నివిధాలా ఆసరాగా ఉంటుందన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, గొరిజాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో ప్రజలకు లాభం : ఎమ్మెల్యే


జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు

నల్లజర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పథకం అమలు ద్వారా దేశ ప్రజలకు ప్రత్యక్షంగా లాభం కలుగుతోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. నబీపేటలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంజూరు చేసిన వరి కోత యంత్రాలు, పురుగుమందు పిచికారీ చేసే డ్రోన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అమలు ద్వారా వినియోగదారులు తక్కువ ధరల్లో సరుకులను పొందడం, వ్యాపారులకు పన్నుల సరళీకరణ, రైతులకు ఉత్పత్తి వ్యయ తగ్గింపు వంటి ప్రయోజనాలు లభిస్తాయన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ జవాబుదారీతనం కలిగి, నిజాయితీగా పన్నులు చెల్లించి, స్థానిక ఉత్పత్తులను వినియోగించాలన్నారు. రైతులు, వ్యాపారులు, సాధారణ ప్రజలకు పారదర్శక ధరలు లభించడంతో పాటు ప్రభుత్వ ఆదాయాలు అభివృద్ధి కార్యక్రమాలు వంటి పనులు వేగవంతం అవుతాయన్నారు. వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత రైతుల శ్రమను తగ్గించడమే కాకుండా పంట దిగుబడులు పెంచుతాయన్నారు. కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, ఏవో సోమశేఖర్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదేవరపేట పెట్రోల్ బంకు తనిఖీ


బంకును పరిశీలిస్తున్న జేసీ మేఘాస్వరూప్, తదితరులు

తాళ్లపూడి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేటలో సొసైటీ ఆధర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకును జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్ శుక్రవారం పరిశీలించారు. కన్స్యూమర్ లైసెన్సుపై నడుపుతూ సంవత్సర కాలంగా నిలిపివేయబడ్డ బంకు లైసెన్స్ రిటైల్ లైసెన్సుగా మార్చి సొసైటీకి, ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ఆలోచనలతో సొసైటీ అధ్యక్షులు గొరిజాల వెంకట ప్రసాద్ (జీవీ) చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా జేసీ మేఘా స్వరూప్ బంకు ఉన్న ప్రదేశాన్ని చూసి పరిశీలించారు. తహశీల్దార్ లక్ష్మీలావణ్య, వీఆర్వో నాగేశ్వరరావు, సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం ఎంపీడీవోగా శ్రీనివాసరావు


అభినందిస్తున్న సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు

ఉండ్రాజవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం ఎంపీడీవోగా మడిపల్లి శ్రీనివాసరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి ఈవోపీఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకి విచ్చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు.

మృతుడి ఆచూకీ లభ్యం

కొవ్వూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో మృతిచెంది ఉన్న వ్యక్తి ఆచూకీ గుర్తించినట్టు పట్టణ ఏఎస్‌ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల్లోకి వెళితే గోష్పాదక్షేత్రంలోని అయ్యప్ప ఆలయం వెనుక ఈనెల 2వ తేదీన వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. దీనిపై స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు చాగల్లుకి చెందిన ఎలక్ట్రీషియన్ వల్లభని సత్యనారాయణ (38)గా గుర్తించారు. మృతుడికి సంవత్సరం క్రితం వివాహం అయ్యిందని, వారం రోజుల క్రితం కుమార్తె పుట్టింది. భార్య పుట్టింటికి పురుడి కోసం అమలాపురం వెళ్లింది. అయితే ఏం జరిగిందో తెలీదు సత్యనారాయణ మృతిచెంది ఉన్నాడు. పోలీసుల సమాచారం మేరకు మృతుని భార్య, బంధువులు మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి భార్య లీల అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

పాట్నా హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు


పూజా కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి అనుపమ చక్రవర్తి

ఉండ్రాజవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పాలంగిలో ప్రసిద్ధి చెందిన క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని పాట్నా హైకోర్టు జడ్జి అనుపమ చక్రవర్తి శుక్రవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. తణుకు పట్టణంలో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు.

గురునాథ్ ఏకగ్రీవ ఎన్నిక


గురునాథ్‌ను అభినందిస్తున్న నాయకులు

కొవ్వూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పీ.గురునాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనే లక్ష్యంగా దూసి భానూజీ ఆధ్వర్యంలో అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ ఏర్పాటయ్యిందన్నారు. ఈ సందర్భంగా గురునాథ్ మాట్లాడుతూ స్థానికంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం, హక్కుల సాధనకు తనవంతు కృషి చేస్తానన్నారు. స్థానిక నాయకులు బోడపాటి నాగేశ్వరరావు, తాడే గణేష్, శ్రీను, తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

రాగి వైరు చోరీ

నల్లజర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముసుళ్లకుంటలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగలు ముగ్గురి రైతులకు సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టి అందులో ఉన్న రాగి వైరును దొంగిలించారు. గ్రామానికి చెందిన పాలకపాటి వెంకటేశ్వరరావు, పాలగాని రాంబాబుకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను పగలకొట్టి అందులో రాగి వైర్లు దొంగిలించినట్టు శుక్రవారం ఉదయం పొలంలోకి వెళ్లిన రైతులు గుర్తించారు. విద్యుత్ అధికారుల ద్వారా నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీలు వరుసగా జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గాంధీ జయంతి


దేవరపల్లిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): అహింసా మార్గం ద్వారా మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన ఘనత మహాత్మాగాంధీకే చెందుతుందని ఆయన్ని ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ శాంతి, ఎంపీటీసీ కామిశెట్టి శిరోమణి, పంచాయతీ వార్డు సభ్యులు పచ్చా రామ్‌గోపాల్, స్థానికులు కామిశెట్టి దుర్గారావు, దుగ్గిన గంగాదర్, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మరోసారి స్వదేశీ ఉద్యమం

- ఖాదీసంతలో స్టాళ్లు తిలకించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్


ఖాదీ సంతలో వస్త్రాలను చూస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మహిళలు

రాజమహేంద్రవరంఅర్బన్, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు మరోసారి స్వదేశీ ఉద్యమానికి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. రాజమహేంద్రవరంలోని సుబ్రహ్మణ్య మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖాదీ సంతను ఆఖరి రోజైన శుక్రవారం ఆయన సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు. అక్కడే ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ నడిపిన స్వదేశీ ఉద్యమాన్ని ప్రధాని స్ఫూర్తిగా తీసుకున్నారని, స్వదేశీ అంటే అదేదో పాత చింతకాయ పచ్చడి కాదని ఇది నిత్య నూతనమని వ్యాఖ్యానించారు. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి, ఖాదీ సంత కన్వీనర్ క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, రొంగల గోపి, నర్సిపల్లి హారిక, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణారావు, కరుటూరి శ్రీనివాసరావు, వీరా వీరాంజనేయులు, కాలెపు సాయిరాం, శెట్టిపల్లి శివనాగరాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మద్దిపాటి రజని స్వదేశీ వస్తు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు.

ఖాదీ, చేనేత ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం : మంత్రి


కార్యక్రమానికి వస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరంలో విదేశీ వస్తువులను బహిష్కరించి, స్వదేశీ వస్తువులను వాడాలన్న ప్రధాని నరేంద్ర మోదీ నినాదాన్ని దేశ ప్రజల్లోకి తీసుకువెళ్దామని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. గురువారం గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సేవా పక్షోత్సవాలను పురస్కరించుకుని,స్థానిక సుబ్రహ్మణ్యం మైదానంలో విక్రమహాల్ నందు ఏర్పాటు చేసిన ఖాదీ మాల్(ఖాదీ ఫర్ నేషన్-ఖాదీ ఫర్ ఫ్యాషన్) కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభిద్దాం, దేశంలో తయారయ్యే ఉత్పత్తులను స్థానికంగా తయారయ్యే వస్తువులను కొనుగోలు చేద్దామని ప్రతిజ్ఞ చేశారు.ప్రభుత్వ తోడ్పాటుతో చేనేత, ఖాదీ ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించడం, తద్వారా దానిపై ఆధారపడి బతుకుతున్న చేనేత కార్మికుల జీవితాలలో గణనీయమైన మార్పులను ప్రోత్సహించాలని మంత్రి తెలిపారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

గోకులషెడ్డు నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు పశువుల షెడ్డును ఏర్పాటు చేయడానికి 90 శాతం సబ్సిడీతో నిధులు మంజూరు చేస్తుందని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లిలో రైతు కవల సురేశ్ పొలంలో శుక్రవారం మంజూరైన రేకులషెడ్డుకు ఎంపీపీ కేవీకే దుర్గారావు, సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, కూటమి నాయకులు సత్తిబాబు, సూరిశెట్టి బాలు, పసుపులేటి శివనాగప్రసాద్, మాధవరపు వెంకటేశ్వరరావు, ఎంపీడీవో నాగార్జునరావు, ఏపీవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 11 ఫిర్యాదులు


గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి వారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి 11 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతి వారం గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి వారి సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సుంకర సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ .. ఓ వరం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఏపీఎస్‌ఎస్‌డీసీ చైర్మన్ శేషారావు

ఉండ్రాజవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరం లాంటిదని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శుక్రవారం వేలివెన్నులో నియోజకవర్గంలోని ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు రూరల్, పట్టణాలకు చెందిన ఆరు మంది లబ్ధిదారులకు రూ.27.20 లక్షల విలువైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి మనసుతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారి వైద్యఖర్చుల నిమిత్తం నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ సీఎం రిలీఫ్ ఫండ్‌ను, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను కొనసాగిస్తున్నట్టు శేషారావు చెప్పారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు అబ్బిశెట్టి సత్తిరాజు, నాయకులు తిరుపతి సత్యనారాయణ, ఈర్పిన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆటోడ్రైవర్ల సేవలో ..


నిడదవోలులో స్థల పరిశీలన చేస్తున్న జిల్లా రవాణాశాఖాధికారి సురేష్

నిడదవోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఆటోడ్రైవర్లకు ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం జిల్లా రవాణాశాఖాధికారి ఆర్.సురేష్, మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కలిసి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గల స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు నాయక్, ఎంపీడీవో జగన్నాథరావు, తదితరులు ఉన్నారు.